నేటి కందం- నేటికి అందం

కోరగ సామాన్యులు-సహ
కారపు రంగమ్మున తన కరయుగళముచేన్
తీరుగ మంత్రి"అమిత్ షా"
"భారత టాక్సీ"ని నేడు ప్రారంభించెన్ !!

(టాక్సీల కోసం సామాన్యుల కష్టాలను తీర్చడం కోసం హోం మంత్ అమిత్ షా "భారత టాక్సీ "ని ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

బూతుపిత జాతిపిత
భలే గాలి దుమారం
రాజకీయ లబ్ధి కొరకు
రచ్చజేసే ఎవ్వారం
ఎవరేమిటో ప్రజల్లో
ఎరుకలేనిదెవరికి
నాటకాలు ఎన్నాడిన
నగుబాటే చివరికి


-వేల్పుల నారాయణ
9440433475



చురక

హైదరాబాద్ శనివారం 7-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:147 పేజీలు:6 వెల: రూ.1/-


## నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: సీఎం రేవంత్



నిజామాబాద్, ఫిబ్రవరి 6: నిజామాబాద్ జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు గెలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని.. దాంతో నగర కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ రూరల్‌లో సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

నిజామాబాద్‌జిల్లా తనకు ఎంతో ప్రత్యేక మైందని సీఎం రేవంత్ రెడ్డి తెలి పారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని పేర్కొ న్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని బర్ధిపూర్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రి కాక ముందు రైతుల సమస్యపై నిజామాబాద్ జిల్లాకు వచ్చానన్నారు. నాడు ఇక్కడి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతోనే తాను ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. తనను ముఖ్యమంత్రి చేయాలని అధినాయకత్వం గుర్తించడానికి నిజామాబాద్ జిల్లానే వేదిక అయ్యిందని గుర్తు చేశారు. ఈ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనది తెలిపారు. నిజామాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, మంచిప్ప ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

### చైతన్యవంతమైన జిల్లా

అంకాపూర్ చికెన్ , నిజామాబాద్ పసుపు ఎంతో ప్రముఖ మైనవన్నారు. గతంలో క్వింటాలు పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేదన్నారు. నిజామాబాద్ జిల్లా రైతాంగం చైతన్య వంతమైందన్నారు. రైతాంగ పోరాటంలో ఈ జిల్లా ముందుంటుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చామన్నారు. 2029 లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తన నాయకత్వంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

### బంగారం లాంటి అవకాశం

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే వృథా అని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని.. ఏ పని చేయాలన్నా ఇక్కడే చేసుకోవచ్చన్నారు. గల్లీలో మోరీ చేయాలంటే ఢిల్లీకి వెళ్లాలా అని ప్రశ్నించారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు మన వాళ్లు ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి ఉద్దండ నేతలు ఉన్నారని.. వారికి డైరెక్ట్‌గా ముఖ్యమంత్రిని నిధులు అడిగే చనువు ఉందన్నారు. బంగారం లాంటి అవకాశాన్ని జారవిడుచుకోవద్దని సూచించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధిలో నిజామాబాద్‌కు ప్రత్యేక స్థానం కల్పిస్తామని.. ఇక్కడి నుంచే అభివృద్ధికి నాంది పలుకుతామన్నారు.

### స్మార్ట్ సిటీ ఎందుకు చేయలేకపోయారు

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మోదీ మంత్రం చదువుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. మోదీ దగ్గర పరపతి ఉందని చెప్పుకుంటున్నారని.. ఏడేళ్లలో ఈ జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అంత పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీ చేయలేకపోయారన్నారు. నిజామాబాద్ ఎయిర్ పోర్టు ఎందుకు మంజూరు కాలేదన్నారు. ఏం తెచ్చారని ఓటు అడుగుతున్నారని ప్రశ్నించారు. అర్వింద్‌కు నిజామాబాద్ ప్రజల ఓట్లు కావాలి.. కానీ.. అభివృద్ధి చేయాలనే లేదని విమర్శలు చేశారు. ఈ రాష్ట్రం నుంచి ఎనిమిది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు నిధులు తేలేకపోయారని.. ఓటు అడిగే మీ హక్కు లేదన్నారు.

### రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు

ఉమ్మడి నిజామాబాద్ జిలాలో రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బాన్సువాడు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో రూ. 1,045 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. నిజామాబాద్ జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర రూ. 600 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత రెండు సంవత్సరాల్లో నిధులు ఇచ్చినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయనుందని ధీమా వ్యక్తం చేశారు.

సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్, పీసీసీ ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, వేణుగోపాల్ , ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ముఖ్యనేతలు మండవ వెంకటేశ్వర్ రావు, టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మోహన రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో తీవ్ర విషాదం..

## బస్సు లోయలో పడి 13 మంది దుర్మరణం

నేపాల్, ఫిబ్రవరి 6: నేపాల్ బైతాడి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళున్న బస్సుఅదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 13మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 30మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తరాఖండ సరిహద్దు సమీపంలో జరిగింది.

సమాచారం అందు కున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

మృతుల్లో ఎక్కువ మంది బజాంగ్ జిల్లా కు చెందిన వారని ఖాట్మండు పోలీసులు తెలిపారు. బస్సు కొండపై ప్రయాణిస్తున్న సమయంలో బ్రేక్ పైపు (ప్రెషర్ పైపు) పగిలిపోవడంతో, డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు.

దీంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని కొండ ప్రాంతాల్లో ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని అధికారులు ఎంతగా చెప్పినా, ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

## గోశాల నిర్మాణంపై విచారణకు దేవాదాయ శాఖ మంత్రి ఆదేశాలు




వరంగల్, ఫిబ్రవరి 6: ఎలాంటి అనుమతులు, అంచనాలు లేకుండా గోవిందరాజుల స్వామి ఆలయం ఆవరణలో చేపట్టిన గోశాల నిర్మాణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని స్థానిక అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ అనువంశీయ అర్చకులు హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి గోశాల పేరుతో జరుగుతున్న తంతును వివరించారు.

వెంటనే స్పందించిన మంత్రి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీతతో ఫోన్లో మాటాడారు. సంబంధిత అంశంపై విచారణ జరిపి నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

గోశాల నిర్మాణానికి అనుమతి కావాలని వినతిపత్రం అందించి, సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించిన అంశాన్ని అనుమతులు మంజూరు చేసినట్లు ప్రచారం చేస్తూ.. అక్రమ వసూళ్లకు పాల్పడటంపై, ఆలయ ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దాంతో దేవాదాయశాఖ అధికారులు శాఖాపమైన విచారణ చేపట్టనున్నారు. మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో వరయోగుల శ్రీనివాస్, వరయోగుల లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 31 మంది దుర్మరణం



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు 31 మంది మరణించగా.. 130 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్చలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్చలు కొనసాగుతున్నాయి.

శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం ఈ ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. ఇది బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు. గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

## వేయిస్తంభాల గుడిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు.. కరపత్రాల ఆవిష్కరణ



హన్మకొండ, ఫిబ్రవరి 6: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 14 నుంచి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ రాముల సునీత తెలిపారు. శుక్రవారం దేవాలయాన్ని సందర్శించిన ఆమె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి అనిల్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు గట్టు మహేష్ బాబు, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర నాయకులు అయినవోలు వెంకట సత్యమోహన్, మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకుడు గంగ్రాతి రాజు, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు మామిడాల గణపతి, వెలమ సంఘం రాష్ట్ర నాయకులు గుజ్జ సంపత్ రావు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఆలయ పరిచారకులు సందీప్‌శర్మ, సిబ్బంది ఎన్ మధుకర్, ఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాముల సునీత మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు, మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బీ, కేంద్ర పురావస్తు శాఖ, పోలీస్ శాఖ, సాంస్కృతిక శాఖ కలిసి సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని, ధర్మదర్శనం క్యూలైన్‌లో వచ్చే భక్తులకు ప్రాధాన్యత కల్పించాలని చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని, రుద్రాభిషేకం క్యూలైన్‌లో వచ్చే భక్తులకు వైదిక సిబ్బంది పూజలు నిర్వహించాలని, వీఐపీ లైన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఐదు రోజులపాటు విద్యుత్ అలంకరణ ఘనంగా ఏర్పాటు చేయాలని, కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు, తలంబ్రాలు అందించాలని, కళ్యాణ వేదిక ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి అనిల్ కుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అన్ని శాఖల వారికి లెటర్లు ఇవ్వడం జరిగిందని, 13వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయని, లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు, జాగరణ ఉండే భక్తులకు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, తాగునీరు సౌకర్యం వాలంటరీస్ స్వచ్ఛంద సంస్థలతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఫిబ్రవరి 14వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని 15వ తేదీ మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామివార్ల కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని, 12 గంటలకు లింగోద్భవం, వేములవాడ, శ్రీశైలం మహానంది క్షేత్రాల్లో జరిగే విధంగానే రుద్రేశ్వరీ-రుద్రేశ్వరుల కళ్యాణోత్సవం జరుగుతుందని ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.

## భాగ్యనగరంలో రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్.!

హైదరాబాద్, ఫిబ్రవరి 6: జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్‌మన్‌కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్‌మన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్‌లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు.

## తెలంగాణలో పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం: మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 6: తెలంగాణలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్టు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారు. కేరళ రాష్ట్రంలో అమలు చేసిన 'కుటుంబశ్రీ' మోడల్‌ను అనుసరించి ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని ఆమె తెలిపారు. కేరళలో సర్వే ద్వారా 65 వేల మంది అత్యంత పేదలను గుర్తించి.. వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. తెలంగాణలోనూ అదే తరహాలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సర్వే చేయించి.. అత్యంత పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామని వివరించారు.

సర్వే తర్వాత ప్రతి కుటుంబానికి వారి అవసరాలకు తగినట్లు సహాయం అందిస్తామని సీతక్క చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా చొరవ తీసుకుంటామన్నారు. అంతేకాకుండా.. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు, శ్రీమంతుల సహకారం తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే మార్గదర్శకాలు రూపొందించి కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కొత్త పథకం ద్వారా తెలంగాణను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం: ఇసిఎండబ్ల్యుఎఫ్

హైదరాబాద్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఇసిఎం డబ్ల్యుఎఫ్ తెలిపింది.

వేసవి చివరలో ప్రారంభం కానున్న ఎల్ నినో ప్రభావంతో భారతదేశం లోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వివరించింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో వేసవి కాలంలో ఉరుములతో కూడిన వర్షాలు తగ్గే అవకాశం ఉందని ప్రకటించింది. గత గణాంకాల ప్రకారం 2002 (48.8), 2003 (48.7), 2015 (47. 6)లో విజయ వాడలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఎల్ నినో ప్రభావంతోనే సంభవించాయని పేర్కొంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వాతావరణ మార్పుల వల్ల ఉదయం వేళల్లో మంచు ఎక్కువగా ఉంటుందని, ప్రమాదాల బారి నుండి తప్పించుకోవడానికి ఉదయం 8, 9 గంటల తర్వాత ప్రయాణాన్ని మొదలుపెట్టి, సాయంత్రం 6 గంటల వరకు ప్రయాణం ముగించాలని సూచించింది.

## 12న ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ

**–తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత**

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ చరిత్రలో మాజీ సిఎం కెసిఆర్‌కు ఒక పుస్తకమే ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కెసిఆర్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. హైదరాబాద్ లో జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాలో మాట్లాడుతూ. .కెసిఆర్ ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం సిఎం రేవంత్ రెడ్డికి లేదని, కెసిఆర్ ను రాజకీయంగా ఎదుర్కోలేకనే రేవంత్ రెడ్డి తిడుతున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ సీరియల్ ఎప్పుడు పూర్తవుతుందో ప్రభుత్వం చెప్పాలని.. చిన్నచేప డిఎస్పి ప్రణీత్ రావుపై చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు.

ప్రణీత్ రావుకు ఆదేశాలిచ్చిన పెద్ద చేపలపై చర్యలు తీసుకోరా.. అని కవిత ప్రశ్నించారు. పార్టీ ఏర్పాటు ప్రక్రియ 3 నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. పార్టీ ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామని, బిసిల అంశంలో బిఆర్ఎస్ ఏనాడు చిత్తశుద్ధితో వ్యవహారించలేదని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ కు ఓటు వేయాలో.. వద్దో.. బిసిలు ఆలోచించుకోవాలని సూచించారు. తాను అసంబద్ధంగా మాట్లాడితే ప్రజలే ప్రశ్నిస్తారని, ఎవరు సమాధానాలు దాటవేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రేమామృతంతో మానవాళి సంతోష మనుగడ

## (07-14 ఫిబ్రవరి "వాలంటైన్స్ వారోత్సవాలు" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన "వాలంటైన్స్ వారోత్సవాలు" ప్రతి ఏట ఫిబ్రవరి 07 నుంచి 14 వరకు నిర్వహించడంతో పాటు చివరి రోజు 14 ఫిబ్రవరిన "వాలంటైన్స్ దినం" లేదా "ప్రేమికుల దినం"గా కూడా పెద్ద ఎత్తున పాటించడం నేటి డిజిటల్ యువతకు అలవాటుగా మారింది. "ప్రేమ", "ఆప్యాయత"లే అమూల్య ఇంధనాలుగా ప్రపంచ మానవాళి శాంతియుతంగా గడుపుతున్నది. శిశువుకు తొలి "ప్రేమ"ను పరిచయం చేస్తుంది అమ్మ. చిరునవ్వుల శిశువు నాన్న "ఆప్యాయత"ను రుచి చూస్తుంది. అమ్మనాన్నలతో ప్రారంభమైన "ప్రేమానురాగాలు", అనంత "ఆప్యాయత"లు క్రమంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వరకు విస్తరించి జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. ప్రేమ నిండిన హృదయాల్లో ద్వేషానికి తావు లేదు. ప్రేమానురాగాల రుచి చూడలేని అభాగ్యుల జీవితాలు గాఢాంధకారంలోనే ముగుస్తాయి. మానవ సంబంధాలతో మొదలైన "ప్రేమలు" చెట్లు, పువ్వులు, పెంపుడు జంతువులు, ఆట వస్తువులు, పుస్తకాలు లాంటి వాటి వరకు విస్తరించి వ్యక్తి జీవితంలో రంగుల సింగడి రుచిని చూపిస్తాయి. కౌమార దశలో అబ్బాయికి అమ్మాయిని చూసినా, అమ్మాయి అబ్బాయిని చూసినా ఏదో తెలియని వ్యతిరేక ధృవాల ఆకర్షణ ప్రేమ పేరుతో ప్రారంభమవుతుంది.

### వాలంటైన్ లేదా ప్రేమికుల వారోత్సవాలు:

యుక్తవయస్సు రాగానే అబ్బాయి, అమ్మాయిల మధ్య ప్రేమ చిగురించి, అద్వితీయ స్నేహం మొదలై, ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకొని పెళ్లి పీటల వరకు చేరి ఏకం అవుతారు. ఇలాంటి "ప్రేమ", "ఆప్యాయత"లే యువ జంట ఏకం కావడానికి, మరో కుటుంబం ప్రారంభం కావడానికి మూలంగా నిలుస్తూ సుసంపన్న వైవాహిక జీవితాలు వెలుస్తాయి. ఇలా యువ ప్రేమికుల మధ్య మొలిచిన ప్రేమలు, చిగురించి వారు వివాహబంధంతో ఏకం కావడానికి వేదికగా ''వాలంటైన్స్ లేదా ప్రేమికుల వారోత్సవాలు'' దోహదపడుతున్నట్లు వివరించబడింది. ఈ ఏడు రోజుల ప్రేమికుల వారోత్సవాల్లో ఒక్కో రోజుకు ఒక ప్రత్యేకత ఆపాదించబడింది.

07 ఫిబ్రవరి : గులాబీల దినం (రోజ్ డే)
08 ఫిబ్రవరి : ప్రతిపాదించు దినం (ప్రపోజ్ డే)
09 ఫిబ్రవరి : చాకొలేట్ దినం (చాకోలెట్ డే)
10 ఫిబ్రవరి : టెడ్డీ బేర్ దినం (టెడ్డీ బేర్ డే)
11 ఫిబ్రవరి : వాగ్దాన దినం (ప్రపోజ్ డే)
12 ఫిబ్రవరి : ఆలింగన దినం (హగ్ డే)
13 ఫిబ్రవరి : ముద్దుల దినం (కిస్ డే)
14 ఫిబ్రవరి : వాలంటైన్స్ లేదా ప్రేమికుల దినం (వాలంటైన్స్ డే)

వాలంటైన్స్ వారోత్సవాల్లో తొలి రోజు 07 ఫిబ్రవరిన యువ జంట ఒకరినొకరు గులాబీలను ఇచ్చిపుచ్చుకొని తమ తమ ప్రేమను వ్యక్తం చేసుకోవడం జరుగుతుంది. రెండవ రోజు 08 ఫిబ్రవరిన ఒకరినొకరు తమ ఇష్టాన్ని, ప్రేమను ప్రకటిస్తూ ప్రతిపాదించుకుంటారు. 10 ఫిబ్రవరి రోజున టెడ్డీ బేర్లను పరస్పరం ఇచ్చిపుచ్చుకొని మరింత దగ్గరవుతారు. 11 ఫిబ్రవరి రోజున ఇరువురు ప్రేమను వ్యక్తం చేస్తూ వాగ్దానం చేసుకుంటారు. 12 ఫిబ్రవరి రోజున తొలి శారీరక స్పర్శ అనుభవాన్ని పొందుతూ ఆలింగనం చేసుకుంటారు. 13 ఫిబ్రవరి రోజు దగ్గరైన యువ జంట తొలిసారి ముద్దులు పెట్టుకోవడం జరుగుతుంది. వారోత్సవాల చివరి రోజు 14 ఫిబ్రవరి రోజుల "వాలంటైన్స్ లేదా ప్రేమికుల దినం" పాటిస్తూ విడదీయరాని ప్రేమానుబంధాలను, అనంత ఆప్యాయతలను వ్యక్తం చేసుకుంటూ ఇద్దరు కలిసి ఒక్కరిగా మారడం, వివాహం వరకు వెళ్లడం జరుగుతుంది.

### 14 ఫిబ్రవరి - వాలంటైన్స్ లేదా ప్రేమికుల దినం :

రోమన్ కాథలిక్ చర్చ్‌కు చెందిన సేయింట్ వాలంటైన్ చొరవతో యువ ప్రేమికులను ఏకం చేయడం, ప్రేమకు పట్టాభిషేకం చేయడాని తన ప్రాణాలను సహితం అర్పించడం జరిగింది. ఈ రోజున యువ జంట ఒకరినొకరు మనసు విప్పి తమ ప్రేమానురాగాలను, అప్యాయతలనుధైర్యంగా వ్యక్తం చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తారు. రోమన్ యువ సైనికులు పెళ్లిళు చేసుకోవడాన్ని నిషేధించారు నాటి రోమన్ చక్రవర్తి క్లాడియస్-2. చక్రవర్తి విధించినా వివాహ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ ప్రేమకు పట్టం కట్టడానికి పూనుకొన్న సేయింట్ వాలంటైన్ ఆ యువ జంటలను ఏకం చేస్తూ పెళ్లి పీటల వరకు తీసుకురావడం జరిగింది. తన నిషేధాజ్ఞలకు విరుద్ధంగా యువ సైనికులకు వివాహాలు చేసిన సేయింట్ వాలంటీన్‌కు క్రీ. శ. 14 ఫిబ్రవరి 269న మరణ శిక్ష విధించడంతో సేయింట్ వాలంటీన్ అమరత్వం పొందారు. తన ప్రాణాలకు తెగించి ప్రేమికులను ఏకం చేయడానికి కృషి చేసిన సేయింట్ వాలంటీన్ వర్ధంతి 14 ఫిబ్రవరి రోజున "వాలంటీన్స్ లేదా ప్రేమికుల దినం" నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

### ప్రేమలు మూడుముళ్ల బంధంగా మారాలి:

భారతీయ సంస్కృతిలో ఇలాంటి పాశ్చాత్య పోకడలకు ఆదరణ తక్కువ. పాశ్చాత్య దేశాల యువతలో తల్లితండ్రులకు తెలియకుండా ఇలాంటి ప్రేమలు వ్యక్తం చేసుకోవడం ప్రేమికులకు సర్వసాధారణం. కొన్ని సందర్భాల్లో యువ ప్రేమికుల జంట కొంత సమయం ఉభయుల అంగీకారంతో తర్వాత విడిపోవడం కూడా సులభంగా జరుగుతుంది. సనాతన భారతంలో ప్రేమించుకున్న యువతీయువకులు రోడ్లు, పార్కులు, పబ్బుల్లో తమ ప్రేమలను వ్యక్తం చేసుకోకుండా ఒక పద్ధతిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహాలు నిశ్చయం చేసుకొని మంగళ సూత్రాల మూడు ముళ్లు పడిన అనంతరం మాత్రమే ఆలింగనాలు, ముద్దుల వర్షాలు లాంటి శారీరక స్పర్శలకు అనుమతి ఇవ్వబడుతుంది. అయినప్పటికీ నేటి ఆధునిక డిజిటల్ భారతీయ యువత ప్రేమకు, కామానికి తేడా తెలియకుండానే క్షణాల్లో ప్రేమించుకోవడం, ఆలింగన ముద్దుల హద్దులు దాటడం, అన్ని రకాల శారీరక సుఖాలను అనుభవించడం, అటు పిమ్మట వాయు వేగంగా విడిపోవడం కూడా చూస్తున్నాం.

తల్లితండ్రులు కుదిర్చిన వివాహాలు కాని ప్రేమ పెళ్ళిళు కాని ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే యువ ప్రేమికుల జంట వివాహ బంధంతో ఏకం కావాలని, తమ వైవాహిక జీవితాన్ని ఆసాంతం ఆస్వాదించాలని, ఆదర్శ జంటగా ఆనంద హరివిల్లుల కుటుంబ జీవనం గడపాలని కోరుకుందాం. కామ ఆకర్షణకు, అంతరంగిక ప్రేమకు తేడాను అర్థం చేసుకొని సన్మార్గంలో తమ జీవితాలను కొనసాగించాలని మార్గనిర్దేశనం చేద్దాం. మూడుముళ్ల బంధాలు మూడు రోజుల్లో విడిపోయి, ఆరు రోజుల్లో విడాకుల వరకు పోకుండా యువ భారతం తమ వైవాహిక జీవితాలకు కట్టుబడి అందమైన కుటుంబ భవిష్యత్తును కనులారా అనుభవించి తరించాలని కోరుకుందాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆలోచనల్లో, పనుల్లో క్రమశిక్షణకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని సంస్కృత సుభాషితం ద్వారా చెప్పిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: జీవితంలో స్పష్టమైన ఆలోచనలకీ, దృఢ సంకల్పానికీ ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు స్పష్టం చేశారు. అలాగే నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల సంకటాలు ఎదురవుతాయని కూడా తెలియజెప్పడం కోసం ఆయన.. మన ప్రాచీన జ్ఞానం మనకిచ్చిన ఓ సందేశాన్ని గురించి ప్రస్తావించారు.

నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడితే అది మన మనసును బలహీనపరిచి, ఉద్దేశాన్ని వక్రీకరిస్తుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ఒకసారి మౌలిక కార్యాల్ని చేపట్టిన తరువాత, సవాళ్లు మరింత గాఢంగానూ, జటిలంగానూ మారిపోతా యనీ, వాటిని అధిగమించడానికి క్రమశిక్షణ, ఏకత, తిరుగులేని సంకల్ప సహకారాన్ని తీసుకోవలసి వస్తుందనీ ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సం దేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ అందులో "వికల్పమాత్రావస్థానే వైరూప్యం మనసో భవేత్‌పశ్చా న్మూలక్రియారంభగంభీరావర్తదుస్తర:" అనే సంస్కృత సుభాషితాన్ని పేర్కొన్నారు.

# డిజిటల్ పాస్‌బుక్‌లతో రైతులకు భరోసా..

### -సాగునీటి ప్రాజెక్టులతో రాయలసీమ అభివృద్ధి
### -కలుగొట్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి వ్యాఖ్యలు




కర్నూలు, ఫిబ్రవరి 6: రైతులకు భరోసా, ఆత్మవిశ్వాసం కల్పించేలా బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కూడిన డిజిటల్ పట్టాదారు పాస్ బుక్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేయడం సంతోషకరమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. కలుగొట్లలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతుల భూహక్కుల పరిరక్షణలో ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిం దని అన్నారు.

**రైతులకు మద్దతుగా ప్రభుత్వం..**

రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో పత్తి, మిరప రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత..**

రాయలసీమ ప్రాంత అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు అత్యంత కీలకమని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా చంద్రబాబు నాయకత్వంలో చెరువులు నిండిపోయి, వేసవి కాలంలో కూడా జలాశయాల్లో నీరు పుష్కలంగా నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆర్‌డీఎస్ కుడి కాలువను టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయగా, గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా ఆలస్యం చేసిందన్నారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు కూడా అదే పరిస్థితికి గురయ్యాయని పేర్కొన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టుపై కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.

గాజులదిన్నె రిజర్వాయర్‌ను అత్యంత కీలక ప్రాజెక్టుగా గుర్తించి క్యాబినెట్ ఆమోదం తెలిపి, రాష్ట్రంలోని 19 ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో చేర్చినందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

**చేనేత రంగానికి ప్రోత్సాహం..**

ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు ప్రభుత్వం ప్రశంసనీయ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ పార్క్ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి రూ.4 కోట్ల నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కలుగొట్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో దేవుని మాన్యాలు, స్మశానాల కోసం భూములు లేకపోవడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. :

గ్రామం లో స్మశానం ఏర్పాటు చేయడం తో పాటు అవసరమైన పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసు కోవాలని ముఖ్యమంత్రిని కోరా రు. రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి తెలిపారు.

# దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాల ప్రదర్శనను ప్రారంభించినందుకు శ్రీలంక అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కొలంబోలోని పావన గంగారామయా ఆలయంలో దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాల ప్రదర్శనను ప్రారంభించినందుకు శ్రీలంక అధ్యక్షుడు శ్రీ అనూర కుమార దిసానాయకేకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీలంకలో 2025వ సంవత్సరం ఏప్రిల్లో తాను పర్యటించిన సందర్భంగా ఈ పవిత్ర అవశేషాలను శ్రీలంకకు తీసుకురావాలని, అక్కడి ప్రజలకు శ్రద్ధాంజలి ఘటించే అవకాశమివ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని ప్రధానమంత్రి గుర్తుకు తెచ్చుకొన్నారు.

భారత్, శ్రీలంక శతాబ్దాలుగా కొనసాగుతూన్న ఉమ్మడి వారసత్వం, సాంస్కృతిక బదిలీలతోనూ, పటిష్ఠమవుతున్న ప్రగాఢ నాగరికతాపరమైన, ఆధ్యాత్మికపరమైన సంబంధాలతోనూ ముడిపడి ఉన్నాయని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాలు శ్రీలంకకు చేరుకోవడం రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా పెనవేసుకొన్న ఆధ్యాత్మిక బంధానికో నిదర్శనంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

భగవాన్ బుద్ధుడు అందించిన కరుణ, శాంతి, సద్భావనల శాశ్వత సందేశం మానవులందరికీ మార్గదర్శకంగా నిలుస్తూ, సరిహద్దులకు ఆవల ఏకతనీ, స్నేహభావాన్నీ పెంపొందిస్తుందన్న ఆశాభావాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శ్రీ మోదీ వేర్వేరు సందేశాల్ని పొందుపరుస్తూ –

"దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాలను కొలంబోలోని పావన గంగారామయా ఆలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచి, ఆ ప్రదర్శనను ప్రారంభించినందుకు శ్రీలంక అధ్యక్షుడు శ్రీ అనూర కుమార దిసానాయకేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ అవశేషాలను శ్రీలంకకు రప్పిస్తామనీ, దీంతో ఆ అవశేషాలను దర్శించుకొని శ్రద్ధాంజలి అర్పించే అవకాశం ప్రజలకు లభిస్తుందనీ నేను 2025వ సంవత్సరం ఏప్రిల్లో శ్రీలంక పర్యటనకు వచ్చిన కాలంలో ఓ నిర్ణయాన్ని తీసుకున్నాం. మన దేశాలు నాగరికత, ఆధ్యాత్మికతల పరంగా ప్రగాఢ బంధంతో ముడిపడి ఉన్నాయి.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం: వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల్లో రైతు ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడం: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ నేడు కీలక ప్రకటన చేశారు. ఈ ఒప్పందం భారత వ్యవసాయ ప్రయోజనాలను, ముఖ్యంగా వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలను పూర్తిగా రక్షిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో జరిగిన ఈ ఒప్పందం దౌత్యనీతి, అభివృద్ధి, ఆత్మగౌరవానికి సరికొత్త నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో ప్రధానమంత్రి మొదటి నుంచీ రాజీ లేని వైఖరితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీ చౌహాన్, భారత ప్రధాన ధాన్యాలు, పండ్లు, ముఖ్యమైన పంటలు, చిరుధాన్యాలు, పాడి ఉత్పత్తులు పూర్తిగా సురక్షితమని, వీటికి ఎటువంటి ముప్పు లేదని పునరుద్ఘాటించారు. చిన్న, పెద్ద రైతుల ప్రయోజనాలను సంపూర్ణంగా కాపాడారని, ఈ ఒప్పందం భారత వ్యవసాయ రంగానికి నష్టాలు కాకుండా కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**చిన్న రైతుల ప్రయోజనాలు, అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల పట్ల వ్యక్తమవుతున్న ఆందోళనలపై వివరణ**

భారతదేశంలో సగానికి పైగా జనాభా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నందున, చిన్న రైతులు ఇబ్బంది పడతారనే ఆందోళనలను మంత్రి శ్రీ చౌహాన్ తోసిపుచ్చారు. విదేశీ వస్తువులు భారత మార్కెట్లోకి అకస్మాత్తుగా ప్రవేశించి అలజడి సృష్టించే అవకాశం లేదని ఆయన హామీ ఇచ్చారు. భారతీయ రైతులకు నష్టం కలిగించే విధంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అన్ని ప్రధాన పంటలు, ఆహార ధాన్యాలు, పండ్లు, డెయిరీ ఉత్పత్తులకు రక్షణ కల్పించామని ఆయన వివరించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో ప్రవేశం పెరుగుతుందంటూ ఆ దేశ ఆర్థిక మంత్రి చేసిన ట్వీట్ వల్ల కలిగిన గందరగోళంపై శ్రీ చౌహాన్ స్పందించారు. దీనికి సంబంధించి వాణిజ్య శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఇప్పటికే పార్లమెంటులో వాస్తవాలను వివరించారని ఆయన గుర్తు చేశారు. స్వదేశీ రైతులపై ఒత్తిడి పడేలా భారత్ తన మార్కెట్లను ఏమాత్రం తెరవలేదని, కీలకమైన వ్యవసాయ ఉత్పత్తులకు రక్షణ కవచం అలాగే ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

**బియ్యం, మసాలా దినుసులు, వస్త్ర ఎగుమతులకు ఊతం**

ఈ ఒప్పందం ద్వారా లభించే ఎగుమతి అవకాశాలను ప్రస్తావిస్తూ, భారత్ ఇప్పటికే అమెరికాతో సహా అనేక దేశాలకు బియ్యాన్ని ఎగుమతి చేస్తోందని, ఇటీవల దాదాపు రూ. 63,000 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. పన్నుల తగ్గింపు వల్ల భారత బియ్యం, మసాలా దినుసులు, వస్త్ర ఎగుమతులకు నేరుగా లబ్ధి చేకూరుతుందని, వస్త్ర ఎగుమతుల వృద్ధి లక్షలాది మంది పత్తి రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన తెలిపారు. ప్రతిపక్షాలు అవాస్తవాలను ప్రచారంలో పెడుతున్నాయనీ, ఈ ఒప్పందం కచ్చితంగా భారతీయ రైతుల ప్రయోజనం కోసమేనని, ఇది కొత్త ఎగుమతి మార్గాలను తెరుస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

వాణిజ్య ఒప్పందం వివరాలను పార్లమెంటులో వెల్లడించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంపై స్పందిస్తూ, ఒప్పందానికి సంబంధించిన అన్ని అంశాలను నిర్ణీత సమయంలో తెలియజేస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. భారతీయ రైతుల ప్రయోజనాలను సంపూర్ణంగా కాపాడాలనేదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అందులో ఎలాంటి రాజీ ప్రసక్తి లేదని ఆయన చెప్పారు.

**"రైతులు అన్నదాతలు: వారికి సేవ చేయడం భగవంతుడిని పూజించడంతో సమానం"**


వ్యవసాయ రంగం చాలా పెద్దది కావడంతో, రైతుల మధ్య గందరగోళం లేదా భయం కలగకుండా స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని శ్రీ చౌహాన్ అన్నారు. "రైతులు మన అన్నదాతలు, జీవన ప్రదాతలు. వారి సంక్షేమమే దేశ సంక్షేమం. వారి ప్రయోజనాలు కచ్చితంగా సురక్షితం" అని పేర్కొన్నారు. మరింత భావోద్వేగంతో మాట్లాడుతూ, రైతులకు సేవ చేయడం దేవుని పూజతో సమానమని, మోదీ ప్రభుత్వం ప్రతి అడుగులోనూ రైతులకు అండగా నిలుస్తుందని శ్రీ చౌహాన్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం.



అమరావతి, ఫిబ్రవరి 6: నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు, శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఓర్పుతో విన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ సంబంధిత, పింఛన్లు, రేషన్, రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు వంటి పలు అంశాలపై అర్జీలు సమర్పించారు. అందిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలిస్తూ సమస్యల తీవ్రతను తెలుసుకున్నారు.

వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలలో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతాయని, ప్రజా పాలన మరింత పారదర్శకంగా మారేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు.



# రైతులకు భూ భద్రత..

## -రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం.

### -కర్నూలు జిల్లా కలుగట్లలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు.



కర్నూలు, ఫిబ్రవరి 6: రైతుల భూములకు సంపూర్ణ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎమ్మిగనూరు మండలం కలుగట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి?మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన విస్తృతంగా ప్రసంగించారు. రాజముద్రతో, విశిష్ట భద్రతా ఫీచర్లతో కూడిన భూ యాజమాన్య పత్రాలను రైతులకు అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

**భూమి రైతుకు విశ్వాసం- ఎవరూ చెరపలేరు..**

భూమి రైతుకు నమ్మకం, విశ్వాసం, అమ్మతో సమానమని ముఖ్యమంత్రి అన్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై ఎవరూ అక్రమంగా హక్కు చెలాయించకుండా భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో భూ రికార్డులను తారుమారు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా వివాదాస్పద భూములపై పెత్తనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ చట్టాన్ని రద్దు చేసి పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ సహా పలు భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని వివరించారు. ఎవరైనా భూ రికార్డులను తారుమారు చేస్తే కఠిన శిక్షలు అమలు చేసేలా నిబంధనలు తీసుకొచ్చామని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో పాస్ పుస్తకాల పంపిణీ..**

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 279 గ్రామాల్లో సర్వే చేపట్టి 1.16 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 37.40 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయని, ఇంకా 62 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. 9500 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 2027 డిసెంబరు నాటికి ప్రతి అర్హుడికి పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్‌ను కేవలం రూ.100తో పూర్తి చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 9వ తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తూ, ఎటువంటి లంచాలు లేకుండా పాస్ పుస్తకాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**రైతు అభివృద్ధికి టెక్నాలజీ, ఆధునిక సాగు..**

రైతులకు లాభదాయక సాగు విధానాలను ప్రోత్సహిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల ముందుకు వచ్చి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం..**

గతంలో కరవుతో ఇబ్బందులు ఎదుర్కొన్న రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 200 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచి వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ సహా పలు పథకాల ద్వారా నీటి వనరులను విస్తరించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పశ్చిమ కర్నూలుకు కూడా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వేదవతి, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. తుంగభద్ర జలాలను కర్నూలు జిల్లాకు మరింతగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు విషయంలో పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు.

**పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం..**

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని అందిస్తూ, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లిస్తున్నామని చెప్పారు. నీరు అందుబాటులో ఉంటే వ్యవసాయం మాత్రమే కాదు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గొల్లపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి కియా మోటార్స్‌కు నీటి సరఫరా కల్పించినట్లు తెలిపారు.

**గత పాలనపై విమర్శలు..**

గత పాలనలో భూ వివాదాలు పెరిగాయని, రైతుల భూములను 22ఏ కింద పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల్లో 80 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని చెప్పారు. సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించేందుకు భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజల పన్నుల డబ్బులను దుర్వినియోగం చేశారని విమర్శించారు.

**విద్యుత్ చార్జీలపై హామీ..**

ప్రజలకు భారం పడకుండా భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులను చెల్లించాల్సి రావడం వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పెరిగిందని పేర్కొన్నారు.

**తిరుమల వ్యవహారంపై స్పందన..**

తిరుమలలో కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారీ జరిగిందని ఆరోపిస్తూ టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం సరిదిద్దిందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం నాణ్యత ప్రమాణాలను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..**

ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# చేనేత, హస్తకళ ప్రదర్శన ప్రారంభం..



నరసరావుపేట, ఫిబ్రవరి 6: పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్లో ఏర్పాటు చేసిన హస్తకళ చేనేత వస్త్ర ప్రదర్శనను బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాల చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలు, సంప్రదాయ హస్తకళ ఉత్పత్తులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని తెలిపారు. చేనేత కార్మికులు తమ కళను నిలబెట్టుకుంటూ ముందుకు సాగేందుకు ప్రభుత్వం తోడ్పాటుతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.

స్థానికంగా తయారయ్యే హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కార్మికులకు చేయూతనివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత కాలంలో యంత్రాలతో తయారయ్యే వస్త్రాలకు పోటీగా చేనేత ఉత్పత్తులు నిలవాలంటే ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సూచించారు. హస్తకళల పరిరక్షణ ద్వారా సంప్రదాయాలు కొనసాగుతాయని, తద్వారా కార్మికుల జీవనోపాధి మరింత బలపడుతుందని అన్నారు. ఈ ప్రదర్శనను ప్రజలు సందర్శించి చేనేత కార్మికులకు మద్దతు తెలపాలని కోరారు.

# రైతులకు భరోసా కల్పించిందే కూటమి ప్రభుత్వం

## -కలుగట్ల కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శలు

కర్నూలు, ఫిబ్రవరి 6: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల భూ హక్కులను కాపాడుతూ భరోసా కల్పిస్తోందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగట్లలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో రైతులు తమ పొలాలకు వెళ్లినా సరిహద్దు రాళ్లపై వైసీపీ నాయకుల ఫోటోలు కనిపించేవని విమర్శించారు. దీంతో పొలం రైతుదా, నాయకులదా అనే భయం నెలకొనేదని అన్నారు. ప్రస్తుతం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తూ రైతులకు ధైర్యం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు తమ ఆస్తులను కాపాడుకునే నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించారని పేర్కొన్నారు.

గత టీడీపీ పాలనలో వ్యవసాయ రంగానికి రూ.71 వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. అయితే వైసీపీ పాలనలో రూ.31 వేల కోట్లు మాత్రమే కేటాయించగా, అందులో సగం నిధులు అవినీతికి గురయ్యాయని ఆరోపించారు.

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేని హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం ఏడాది వ్యవధిలోనే పూర్తి చేసే దిశగా ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు కీలకమని పేర్కొన్నారు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుపై దృష్టి పెట్టలేదని మంత్రి విమర్శించారు. అధికారాన్ని కోల్పోయిన తర్వాతే ఆ ప్రాజెక్టును గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు సంబంధించి 2020 ఏప్రిల్ 20న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) స్టే ఆర్డర్ జారీ చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం 2020 అక్టోబర్ 29న పనులు నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ వాటిని పట్టించుకోలేదని తెలిపారు. ఎన్‌జీటీ ఆదేశాలను లెక్క చేయకుండా పనులు కొనసాగించడంతో 2024 మార్చి 22న రూ.2.6 కోట్ల జరిమానా విధించబడిందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# 5జీ వ్యవస్థ ద్వారా అందించదగ్గ నూతన సేవల్ని ప్రోత్సహించే దిశగా అనేక చర్యలు చేపట్టిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: 5జీ వ్యవస్థలో ఉపయోగించడానికి అనువైన అప్లికేషన్ల రూపకల్పనను ప్రోత్సాహించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు రాజ్యసభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు. 5జీ సాంకేతికత.. హై-స్పీడ్ సంధానాన్నీ, సమాచారాన్ని ఇవ్వడంలో ఆలస్యం లేకుండా పెద్ద సంఖ్యలో సంధానించిన ఉపకరణాలకు అండగా ఉంటుంది. డిజిటల్ సేవల్లో, ఆటొమేషన్లో కృత్రిమ మేధ (ఏఐ)నీ, బ్లాక్‌చైన్ సాంకేతికతనీ ఉపయోగించడానికి ఇది వీలు కల్పిస్తుంది. వివిధ రంగాల్లో 5జీ సేవల అభివృద్ధి ప్రక్రియను ప్రోత్సాహించడానికి విద్యాసంస్థల్లో వంద 5జీ యూజ్ కేస్ ప్రయోగశాలల్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటికి కృత్రిమ మేధ (ఏఐ), బ్లాక్‌చైన్ తదితర సరికొత్త సాంకేతికతలను కూడా సంధానించారు. యూజ్ కేస్ ప్రయోగశాలల కార్యక్రమంలో భాగంగా 5జీని ఉపయోగిస్తూ '5జీ ఇన్నొవేషన్ హ్యాకథాన్-2025'ను ప్రారంభించారు. 5జీనీ, ఏఐనీ, ఆధునిక సాంకేతికతలనీ ఉపయోగించుకుంటూ సేవలను అభివృద్ధిపరచడం ఈ కార్యక్రమం లక్ష్యం. సామాజికంగా, ఆర్థిక కార్యకలాపాల పరంగా ఉపయోగించదగ్గ సేవలను అభివృద్ధి పరచడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయి. నవకల్పననీ, విద్య- పరిశ్రమ రంగాల మధ్య సహకారాన్నీ పెంచడంతో పాటు, ఆర్థికాభివృద్ధి సాధనకు విద్యారంగానికీ, అంకుర సంస్థల రంగానికీ చెందిన అనుబంధ విస్తారిత వ్యవస్థల్ని కూడా బలపరచాలన్న ధ్యేయాన్ని ఈ కార్యక్రమాలకు నిర్దేశించారు.

అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభించిన 5జీ వ్యవస్థ 99.9 శాతం జిల్లాల్లో అందుబాటులో ఉండడంతో పాటు, 85 శాతం జనాభాకు సేవలను అందిస్తున్నాయి. 2025 డిసెంబరు నాటికి 5 లక్షల ఎనిమిది వేల 5జీ బేస్ ట్రాన్స్‌సీవర్ స్టేషన్ (బీటీఎస్)లను ఏర్పాటు చేశారు. మీడియన్ మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ కూడా చెప్పుకోదగినంతగా విస్తరించి, 2025 అక్టోబరుకు 131.47 ఎంబీపీఎస్‌కు చేరుకుంది.

దీనికి అదనంగా, ప్రమాణీకరణ, డిజిటల్ డేటాను సురక్షితంగా ఉంచుతూ చదవడానికి వీలుపడని కోడ్ లోకి మార్చడం (ఎన్‌క్రిప్షన్)తో పాటు నెట్‌వర్క్ ఐసొలేషన్ వంటి ఉన్నత భద్రతా ఫీచర్లు 5జీలో ఉంటాయి. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్) ఆదేశాలకు అనుగుణంగా సైబర్ భద్రత నియమాలను పాటించడంతో పాటు, విశ్వసనీయ టెలికం ప్రణాళిక.. నమ్మదగ్గ మూలాల నుంచే సేకరణ జరిగేటటుగా చూస్తుంది. కమ్యూనికేషన్ సెక్యూరిటీ సర్టిఫికేషన్ (కామ్‌సెక్) పథకంలో భాగంగా, 5జీ నెట్‌వర్క్ విధులను దృష్టిలో పెట్టుకొని ఇండియన్ టెలికం సెక్యూరిటీ అష్యూరెన్స్ రిక్వైర్‌మెంట్స్ (ఐటీఎస్ఏఆర్‌స్)ను సిద్ధం చేశారు. ఈ ప్రమాణాల్ని పరిశ్రమ పాటించడం వల్ల ఇటు భద్రతనీ, అటు నవకల్పననీ సమతౌల్యం చేసుకోవడం సాధ్యపడుతుంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## -డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్

భూపాలపల్లి, ఫిబ్రవరి 6: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్- పద్మ పార్టీ కౌన్సిలర్ గెలుపు కొరకు ఎన్నికల ప్రచారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ , ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి , టిటిపిసి సభ్యులు చల్లూర్ మధు,పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు స్థాయిలో పార్టీ కార్యాలయాల ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించేలా పనిచేస్తామని తెలియజేయడం జరిగింది.

# భారత్-జీసీసీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విషయంలో నియమావళిపై సంతకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భారత్, గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) సంబంధించిన 'నియమావళి'పై (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్- టీఓఆర్) 2026 ఫిబ్రవరి 5న ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో భారత ప్రధాన సంప్రదింపుల అధికారి అయిన వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అజయ్ భాదూ.. జీసీసీ ప్రధాన సంప్రదింపుల అధికారి అయిన జీసీసీ సెక్రటేరియట్ జనరల్ డాక్టర్ రాజా అల్ మర్జూఖీ సంతకాలు చేశారు. కేంద్ర వాణిజ్య- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, కేంద్ర సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద, వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

జీసీసీ-భారత్ ఎఫ్‌టీఏ పరిధి, విధివిధానాలను ఈ నియమావళి (టీఓఆర్) నిర్దేశిస్తోంది.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ ఎఫ్‌టీఏ ప్రపంచ శ్రేయస్సు కోసం ఒక గొప్ప చోదక శక్తిగా పనిచేస్తుందని చెప్పారు. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలలో స్పష్టత, స్థిరత్వాన్ని తీసుకువస్తుందని.. తద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఆయన పేర్కొన్నారు. వస్తు సేవల నిరంతర సరఫరా, పెట్టుబడుల ఆకర్షణకు ఈ ఎఫ్‌టీఏ దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీనితో పాటు ఉద్యోగ అవకాశాల కల్పనతో పాటు ఆహార, ఇంధన భద్రతను పెంపొందిస్తూ మన మధ్య ఉన్న ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.


ప్రధాన సంప్రదింపుల అధికారి అయిన గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ సెక్రటేరియట్ జనరల్ డాక్టర్ అల్ మర్జూఖీ మాట్లాడుతూ.. భారత్, జీసీసీ దేశాల మధ్య చారిత్రక వాణిజ్య సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ టీఓఆర్‌పై సంతకాలు చేయడం ద్వారా ఇరుపక్షాలకు ప్రయోజనకరమైన ఎఫ్‌టీఏ దిశగా చర్చలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో ఈ ఒప్పందం భారత్-జీసీసీ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన ప్రధానంగా చెప్పారు.

ఈ పర్యటనలో భాగంగా భారత వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్‌తో డాక్టర్ రాజా అల్ మర్జూఖీ సమావేశమయ్యారు. భారత్, జీసీసీ మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం.. పరస్పర ఆసక్తి ఉన్న అంశాలలో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

భారత్‌కు చారిత్రక వాణిజ్య సంబంధాలు ఉన్న కీలకమైన గల్ఫ్ ప్రాంతంతో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి భారత్-జీసీసీ ఎఫ్‌టీఏ గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్-జీసీసీ మధ్య మొత్తం వాణిజ్యం 178.56 బిలియన్ డాలర్లుగా నమోదైంది (ఎగుమతులు: 56.87 బిలియన్ డాలర్లు, దిగుమతులు: 121.68 బిలియన్ డాలర్లు). ఇది భారత్‌కు సంబంధించిన మొత్తం విదేశీ వాణిజ్యంలో 15.42 శాతానికి సమానం. గత ఐదేళ్లలో జీసీసీతో దేశ వాణిజ్యం స్థిరంగా వృద్ధి చెందుతూ సగటున ఏడాదికి 15.3 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. భారత్ నుంచి జీసీసీ దేశాలకు ప్రధానంగా ఇంజనీరింగ్ వస్తువులు, బియ్యం, వస్త్రాలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు ఎగుమతి అవుతున్నాయి. జీసీసీ నుంచి భారత్‌కు ప్రధానంగా ముడి చమురు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, బంగారం వంటి విలువైన లోహాలను దిగుమతి చేసుకుంటోంది. మొత్తంగా చూస్తే 2024 నాటికి 61.5 మిలియన్ల జనాభా కలిగిన జీసీసీ దేశాలు.. ప్రస్తుత ధరల ప్రకారం 2.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీని కలిగి ఉన్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా 9వ స్థానంలో ఉంది. అంతేకాకుండా భారత్‌కు ఎఫ్‌డీఐ అందించడంలో జీసీసీ ఒక ముఖ్యమైన ప్రాంతంగా ఉంది. సెప్టెంబర్ 2025 నాటికి ఈ దేశాల నుంచి వచ్చిన మొత్తం పెట్టుబడులు 31.14 బిలియన్ డాలర్లు దాటాయి.

జీసీసీ ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులకు నివసిస్తున్నారు. అక్కడ ఉన్న అనేక భారతీయ కంపెనీలు.. ఇరు ప్రాంతాల మధ్య ఉన్న ఈ బలమైన, చిరకాల ప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ..



నరసరావుపేట, ఫిబ్రవరి 6: పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం 33 మంది లబ్ధిదారులకి రూ .20.17 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఈ రోజు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేదల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 18 నెలల కాలంలో నరసరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 729 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్ల 81 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్‌ఓసీ (లెటర్ అఫ్ క్రెడిట్) ద్వారా 173 మంది లబ్ధిదారులకు రూ.1 కోటి 37 లక్షల ఎల్ ఓ సి చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ వారికి అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తోడ్పాటును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పాకల బీచ్ అభివృద్ధికి కృషి

అమరావతి, ఫిబ్రవరి 6: ప్రకాశం జిల్లా సింగరాయకొండ పాకల బీచ్ లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం గిద్దలూరు సమీపంలోని రాయల్ రిసార్ట్స్ లో పాకల బీచ్ ఫెస్టివల్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను, ఏ.వి ఆడియోను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. రాజబాబు లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని పాకల బీచ్ లో ఈనెల 14, 15వ తేదీల్లో రెండు రోజులు పాటు బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం పాకల బీచ్ లో నిర్వహించే ఫెస్టివల్ కు ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన కోరారు. ప్రకాశం జిల్లా పాకల బీచ్ రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు.




# పార్లమెంట్ ప్రశ్న: వన్యప్రాణులు, జంతు పరిరక్షణ కార్యక్రమాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: వన్యప్రాణుల సంరక్షణ, రక్షణ, నిర్వహణకు వన్యప్రాణుల (సంరక్షణ) చట్టం 1972 వీలు కల్పిస్తుంది. ఈ చట్టం వన్యజీవుల వేటను నియంత్రిస్తుంది. అలాగే అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, సంరక్షణ రిజర్వులు, కమ్యూనిటీ రిజర్వులు ప్రకటించడానికి విధానాలను నిర్దేశిస్తుంది. ఈ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు, శిక్షలను కూడా విధిస్తుంది.

వన్యప్రాణుల సంరక్షణ, రక్షణ, వాటి ఆవాసాల మెరుగుదలే లక్ష్యంగా.. కేంద్ర ప్రభుత్వ పథకాలైన "డెవలప్‌మెంట్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ హ్యాబిటాట్స్" (వన్యప్రాణుల నివాసాల అభివృద్ధి), 'ప్రాజెక్ట్ టైగర్ అండ్ ఎలిఫెంట్' కింద రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

ఈ ప్రాంతానికి చెందని మొక్క జాతుల తొలగింపు, నీటి గుంతల ఏర్పాటు, గడ్డి భూముల నిర్వహణ, అగ్నిమాపక మార్గాల నిర్వహణ, మట్టి, తేమ సంరక్షణ పనులు, వేటగాళ్ల నిరోధక శిబిరాల ఏర్పాటు, నిర్వహణ, గస్తీ బృందాలు, ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, వన్యప్రాణుల పశువైద్య సంరక్షణకు ఈ పథకాలు మద్దతిస్తాయి. జంతువుల పర్యవేక్షణకు, అక్రమ చొరబాట్లను గుర్తించడం కోసం కెమెరా ట్రాప్‌లు, డ్రోన్లు, ఈ-సర్వైలెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని కూడా ప్రోత్సహిస్తాయి. మానవ వన్యప్రాణుల సంఘర్షణను నిర్వహించడానికి క్షేత్ర స్థాయిలో త్వరిత ప్రతిచర్య బృందాలకు సమాచారాన్ని అందించడంలో ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ఏర్పాటుకు, స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించే పర్యావరణ-అభివృద్ధి కార్యకలాపాలకు సహకరిస్తాయి.

పులి, ఏనుగు, డాల్ఫిన్ వంటి కీలక జాతుల సంరక్షణను ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫెంట్, ప్రాజెక్ట్ లయన్, ప్రాజెక్ట్ స్నో లెపార్డ్ (మంచు చిరుత), ప్రాజెక్ట్ డాల్ఫిన్ వంటి వాటిని ప్రత్యేక కార్యాచరణ పద్ధతిలో అమలు చేస్తున్నారు. 'అత్యంత ప్రమాదంలో ఉన్న జాతులు, వాటి ఆవాసాల సంరక్షణ కోసం పునరుద్ధరణ కార్యక్రమం' కింద గుర్తించిన 24 రకాల అంతరించిపోతున్న జాతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి సంరక్షణ కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయం అందిస్తుంది.

వన్యప్రాణుల సంఖ్య అంచనాను ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తుంటాయి. గుర్తించిన కీలక జాతుల సంఖ్య అంచనా జాతీయ స్థాయిలో జరుగుతుంది. దేశంలో తొలిసారిగా నిర్వహించిన శాస్త్రీయ అంచనా ప్రకారం.. మంచు చిరుతల సంఖ్య 718 గా, నది డాల్ఫిన్ల సంఖ్య 6,327 గా నమోదైంది. 2022 అఖిల భారత పులుల అంచనా ప్రకారం.. దేశంలో పులుల సంఖ్య 3,682 (పరిధి 3167-3925) కు పెరిగింది. 2018లో ఈ సంఖ్య 2,967 (పరిధి 2603- 3346) గా ఉండేది. 'దేశంలో చిరుతపులుల స్థితి - 2022' నివేదిక ప్రకారం.. దేశంలో చిరుతల సంఖ్య 13,874 (పరిధి 12,616? 15,132) గా భావిస్తున్నారు. 2018 నివేదికలో ఇది 12,852 (12,17 2-13, 535) గా ఉంది.

వన్యప్రాణులను రక్షించడానికి, వృద్ధికి, అభివృద్ధికి తోడ్పడేలా దేశంలో రక్షిత ప్రాంతాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ రక్షిత ప్రాంతాల సంఖ్య 2020లో 981 ఉండగా, 2025 నాటికి 1134కు పెరిగింది. అదేవిధంగా ఇదే కాల వ్యవధిలో పులుల సంరక్షణ కేంద్రాల సంఖ్య 50 నుంచి 58కి, ఏనుగుల సంరక్షణ కేంద్రాల సంఖ్య 30 నుంచి 33కి పెరిగాయి.

ఎకోలాజికల్ అనుసంధానతను కొనసాగించడానికి 32 పులుల కారిడార్లను, 150 ఏనుగుల కారిడార్లను గుర్తించారు. జాతీయ పార్కులు, అభయారణ్యాలు, పులులు, ఏనుగుల సంరక్షణ కేంద్రాల నిర్వహణ ఎంత సమర్థవంతంగా జరుగుతుందో అంచనా వేసేందుకు 'మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్‌నెస్ ఎవాల్యుయేషన్' (నిర్వహణ ప్రభావశీల మూల్యాం కనం- ఎంఈఈ) ప్రక్రియను కూడా చేపట్టారు.

ఈ సమాచారాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ నేడు రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా అందించారు.

# పూర్తి అధికారిక మర్యాదలతో శ్రీలంక చేరిన భగవాన్ బుద్ధుని పవిత్ర దేవ్‌నీమోరీ అవశేషాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: భగవాన్ బుద్ధునికి చెందిన దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాలు శ్రీలంకకు చేరుకోవడం, అక్కడ వాటి ప్రదర్శనను నిర్వహించడం భారత్, శ్రీలంకల మధ్య గల ప్రగాఢ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నాగరికతా సంబంధాలకు ప్రతీకగా నిలవడంతో పాటు, రెండు దేశాల ఉమ్మడి బౌద్ధ వారసత్వంలో ఇమిడిపోయి ఉన్న చిరకాల సంబంధాల్ని మరింత బలోపేతం చేస్తుంది.

భారతీయ వైమానిక దళ ప్రత్యేక విమానంలో శ్రీలంక చేరిన పవిత్ర అవశేషాలకు భారత్-శ్రీలంక ప్రోటోకాల్‌కు అనుగుణంగా పూర్తి అధికార మర్యాదలను అందించారు. గుజరాత్ గవర్నరు శ్రీ ఆచార్య దేవ్‌వ్రత్, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘవీల నాయకత్వంలో ఓ ఉన్నత స్థాయి భారతీయ ప్రతినిధి వర్గం పవిత్ర అవశేషాల వెంట వెళ్లింది. ఈ ప్రతినిధి వర్గంలో సీనియర్ బౌద్ధ భిక్షువులు, ప్రభుత్వ అధికారులతో పాటు ఇతర ప్రముఖులు కూడా ఉన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 ఏప్రిల్లో అధికారిక పర్యటనకు శ్రీలంక వెళ్లినప్పుడు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలను విస్తరించుకోవడానికి భారత్ కట్టుబడి ఉంటుందని ప్రకటించారు. ఆ ప్రకటనకు తరువాయిగా చేపట్టిన చర్యే ఇప్పటి ప్రదర్శన. ప్రధానమంత్రి ఆ పర్యటనలో.. బౌద్ధ సంబంధాల వ్యాప్తికి 2020వ సంవత్సరంలో ప్రకటించిన 15 మిలియన్ అమెరికా డాలర్ల గ్రాంటుకు అదనంగా అనురాధపురాలో సేక్రెడ్ సిటీ కాంప్లెక్స్ ప్రాజెక్టు అభివృద్ధికి ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కూడా ప్రకటించారు.

దేవ్‌నీమోరీ పవిత్ర అవశేషాల ప్రదర్శనను కొలంబోలోని పావన గంగారామయా ఆలయంలో 2026 ఫిబ్రవరి 4న శ్రీలంక అధ్యక్షుడు శ్రీ అనూర కుమార దిసనాయకే.. గుజరాత్ గవర్నరు, గుజరాత్ ఉప ముఖ్యమంత్రిలతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంగారామయా ఆలయం ముఖ్య ప్రతినిధి డాక్టర్ కిరిందే అసాజీ థెరో కూడా పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం విలువలకు కట్టుబడి..
# ఇచ్చిన మాట ప్రకారం ఒక్క రూపాయి విద్యుత్ చార్జీలు పెంచలేదు

**-నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా**

**-నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి**



అమరావతి, ఫిబ్రవరి 6: కూటమి ప్రభుత్వం విలువలకు కట్టుబడి పని చేసే ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన అనంతరం ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలంలోని చింతలపల్లి పంచాయితిలో నూతనంగా రూ 3.60.కోట్లతో నిర్మించిన 33/11 విద్యుత్ ఉప కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం సబ్ స్టేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రజలకు రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

గిద్దలూరు మార్కాపురం కనిగిరి ప్రాంతాల్లో నూతన విద్యుత్ సబ్స్టేషన్ ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అందుకు అవసరమైన భూసేకరణ కూడా చేస్తున్నామని తెలిపారు. బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, గిద్దలూరులో కూడా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతోపాటుగా గిద్దలూరులో పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లో వోల్టేజీ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఒంగోలు విద్యుత్ శాఖ ఎస్. ఈ వెంకటేశ్వర్లు, గిద్దలూరు విద్యుత్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి శేషగిరిరావు కొమరోలు అసిస్టెంట్ ఇంజనీర్ ఎం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల ప్రభావం వల్ల నాశనం అవుతున్న యువత భవిష్యత్తు

**-మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులో విజయ మోహన్ రావు**




ఏలూరు ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నేటి బాలలే రేపటి పౌరులని, సమాజాన్ని సక్రమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత బాల బాలికలదేనని ఇంటర్నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ డి.జి.సి.ఇ.ఓ. ఉ చైర్మన్ డాక్టర్ సి.హెచ్. విజయ మోహన్ రావు పేర్కొన్నారు. గురువారం ఏలూరు జిల్లా, కుక్కునూరు మండలం, నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో కుకునూరు మండలంలోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల, చీరవల్లి జెడ్పీ హై స్కూల్, రాజీవ్ నగర్ జెడ్పీ హై స్కూల్‌లలో "సే నో టు డ్రగ్స్ ? సే నో టు కరప్షన్'' అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మోహన్ రావు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల ప్రభావం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, చిన్న వయసు నుంచే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు, విద్యావంతులు, యువకులు మరియు సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్ మాట్లాడుతూ, బాల్యం నుంచే విద్యార్థులు డ్రగ్స్ మరియు అవినీతిపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా జనరల్ సెక్రటరీ సుధాకర్ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు అలవాటు పడితే కలిగే దుష్ప్రభావాలు, ఆరోగ్య సమస్యలు మరియు సామాజిక నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ బయ్యాని నాగేశ్వరరావు, జిల్లా చీఫ్ అడ్వైజర్ మంత్రి గోపాలకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బుడుగుల తరుణ్, మునగాల సాయి, కీసరి సాంబశివరావు, రాజీవ్ నగర్ జెడ్పీ హై స్కూల్ హెడ్‌మాస్టర్, కుకునూరు బాలికల ఆశ్రమ పాఠశాల హెడ్‌మాస్టర్ మంగమ్మ, చీరవల్లి హై స్కూల్ హెడ్‌మాస్టర్ రాధతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఔషధ మొక్కలకు స్థానికత ధ్రువపత్రాల జారీకి డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పరిధిలోని చట్టబద్ధ సంస్థ అయిన జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ (ఎన్‌బీఏ) ఒక డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించింది. సాగు చేసిన ఔషధ మొక్కలను అందు బాటులోకి తీసుకురావడానికీ, మినహాయింపుల ప్రయోజనాలను పొందడానికీ వీలు కల్పించేలా సంబంధిత భాగస్వాములకు స్థానికత ధ్రువపత్రాలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఈ పోర్టల్ అందిస్తుంది.

దరఖాస్తు ప్రక్రియను చేపట్టడానికి, స్థానికత ధ్రువపత్రాలను జారీ చేసే సింగిల్ విండోగా, పూర్తి ఆన్‌లైన్ విధానంగా ఈ పోర్టల్ పని చేస్తుంది.

2023 జులై 25న లోక్‌సభలో, 2023 ఆగస్టు 1న రాజ్యసభలో జీవ వైవిధ్యం (సవరణ) చట్టం- 2023 ఆమోదం పొందింది. 2024, 2025లో ఈ ఎఫ్‌సీసీ మంత్రిత్వ శాఖ జీవవైవిధ్య నియమాలను నోటిఫై చేసింది.

సవరించిన చట్టాన్ని అమల్లోకి తీసుకురావడానికి, ఆయుష్, విత్తన విభాగాలు, పరిశోధనా సంస్థలతో సహా సంబంధిత వర్గాల్లో విధాన అవసరాలను తీర్చడానికి జీవవైవిధ్య నియమాలను 2024, 2025లో పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. సాగు చేసిన ఔషధ మొక్కలకు నిర్దేశిత డిజిటల్ పోర్టల్ ద్వారా స్థానికత ధ్రువపత్రాలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో జారీ చేసే వెసులు బాటును సవరించిన నియమాలు అందిస్తాయి.

# అణు విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎన్టీపీసీ ప్రణాళిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిపాలన పరిధిలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీ ఎన్టీపీసీ. కింద పేర్కొన్న రెండు మార్గాల్లో 2047 నాటికి 30 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించేందుకు ప్రణాళికలను రూపొందిస్తోంది:

ఎన్టీపీసీ, భారత అణు ఇంధన కార్పొరేషన్ (ఎన్పీసీఐఎల్) సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పడిన అణుశక్తి విద్యుత్ నిగమ్ (అశ్విని).. రాజస్థాన్‌లోని బన్స్వారా జిల్లాలో 4700 మెగావాట్ల సామర్థ్యంతో.. మహీ బన్స్వారా రాజస్థాన్ అణు విద్యుత్ ప్రాజెక్టు (ఎంబీఆర్‌ఏపీపీ) పేరుతో ఒక అణు విద్యుత్ ప్లాంటును నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ఎన్టీపీసీ తన పూర్తి యాజమాన్యంలో 'ఎన్టీపీసీ పరమాణు ఉర్జా నిగమ్ లిమిటెడ్ (ఎన్పీయూఎన్ఎల్) అనే అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. అవసరమైన అన్ని అనుమతులు పొందిన అనంతరం.. 2025 జనవరి 7న కంపెనీల చట్టం కింద దీనిని ఏర్పాటు చేసింది.

2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలన్న ప్రభుత్వ సంకల్పంలో... పైన పేర్కొన్న 30 గిగావాట్ల లక్ష్యం ఒక ముఖ్యమైన భాగం.

వివిధ ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి, అవకాశమున్న అంతర్జాతీయ భాగస్వాములతో సహకారం కోసం.. ఎన్టీపీసీ ఒక ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించింది.

ఎన్టీపీసీ తన జాయింట్ వెంచర్ అయిన అశ్వినీ ద్వారా రాజస్థాన్‌లోని బన్స్వారా జిల్లాలో 'మహి బన్స్వారా రాజస్థాన్ అణు విద్యుత్ ప్రాజెక్ట్ (ఎంబీఆర్‌ఏపీపీ)' పేరుతో 4700 మెగావాట్ల సామర్థ్యం గల అణు విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఎంబీఆర్‌ఏపీపీ మొదటి 700 మెగావాట్ల యూనిట్ తొలి పరీక్ష 2032-33 ఆర్థిక సంవత్సరం నాటికి జరుగుతుందని ప్రస్తుత అంచనాలను బట్టి తెలుస్తోంది.

లోకసభలో ఈ రోజు ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద నాయక్ ఈ సమాచారాన్ని అందించారు.

# కాంగ్రెస్ పార్టీ కి ఆలోచనా విధానం గానీ, దూరదృష్టి గానీ, ఎలాంటి ప్రణాళిక గానీ లేవు

**-తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ప్రధాని నరేంద్ర మోదీ**

న్యూ డిల్లీ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ పార్టీ పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి ఒక ఆలోచనా విధానం గానీ, దూరదృష్టి గానీ, ఎలాంటి ప్రణాళిక గానీ లేవని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీరుపైనా మండిపడ్డారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో ఖర్గే సహా విపక్ష నేతలు నినాదాలు చేయడంతో ప్రధాని మోదీ ఈ విధంగా స్పందించారు. ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకించిన విపక్ష సభ్యులు.. దేశంలో నియంతృత్వం నడవదంటూ నినాదాలు చేశారు. సభ్యుల నిరసన మధ్యే ప్రధాని మోదీ తన ప్రసంగం కొనసాగించారు. ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు తెలిసిందని స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించానని ఆయన చెప్పారు. కాగా లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం సిగ్గుచేటని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

# ఎల్‌ఎల్‌బీ డిగ్రీ గుర్తింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్న కొన్ని విశ్వవిద్యాలయాలు, న్యాయ కళాశాలలు అందించిన ఈవెనింగ్ ఎల్‌ఎల్‌బీ కోర్సులకు గతంలో అమల్లో ఉన్న న్యాయ విద్య నియమాలు-1989 ప్రకారం అనుమతులను, గుర్తింపును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అందించేది. ఇది అప్పటి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేది. అయితే 2000-2001 విద్యా సంవత్సరం నుంచి న్యాయ విద్య ప్రమాణాలు, న్యాయ డిగ్రీల గుర్తింపు (నియమాలు) అని పిలిచే న్యాయ విద్య నియమాలు-1999 ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈవెనింగ్ లా డిగ్రీ కోర్సుల గుర్తింపును రద్దు చేసింది.

నాయ్య విద్య నియమాలు - 2008 ప్రకారం ఈ పద్ధతిని ఇండియన్ బార్ కౌన్సిల్ స్థిరంగా కొనసాగిస్తోంది. దీని ప్రకారం ఎల్‌ఎల్‌బీను సాధారణ, పూర్తి స్థాయి వృత్తిపరమైన కోర్సుగా తప్పనిసరి చేసింది. దీనికి రోజువారీగా, వారంవారీగా తరగతి గంటలు, కనీస హాజరు, ఉదయం 8గం.ల నుంచి సాయంత్రం 7గం.ల వరకు నిర్దేశిత బోధనా పద్ధతులు అవసరం. అదే విధంగా, 2000-2001 నుంచి ఏ రాష్ట్రంలోనూ ఈవెనింగ్, నైట్ స్కూల్, పార్ట్-టైం, వీకెండ్, హాలిడే, ఆన్లైన్, డిస్టెన్స్ ఎల్‌ఎల్‌బీ కోర్సులను నిర్వహించడం లేదు. చట్టబద్ధమైన నియమాలు, ఉత్తర్వుల ద్వారా ఇండియన్ బార్ కౌన్సిల్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

పైన పేర్కొన్న విధంగా విద్యా సంవత్సరం 1999-2000 వరకు ఈవెనింగ్ క్లాసుల ద్వారా లా డిగ్రీని పూర్తి చేసిన ఎల్‌ఎల్‌బీ పట్టభద్రులు అడ్వకేట్లుగా నమోదు చేసుకొనేందుకు అర్హులు. ఆ తర్వాత పూర్తి చేసినవారికి అర్హత ఉండదు.

రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు ఈ సమాచారాన్ని లిఖిత పూర్వక సమాధానంగా న్యాయ శాఖ సహాయ (స్వతంత్ర హోదా), పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ రోజు అందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**-డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్**

భూపాలపల్లి, ఆంధ్రప్రభ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్- పద్మ పార్టీ కౌన్సిలర్ గెలుపు కొరకు ఎన్నికల ప్రచారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ , ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి , టిటిపిసి సభ్యులు చల్లూర్ మధు,పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు స్థాయిలో పార్టీ కార్యాలయాల ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించేలా పని చేస్తామని తెలియజేయడం జరిగింది.

ఉచిత కరెంటు 200 యూనిట్లు, రూ 500 లకు వంట గ్యాస్, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం, రైతు భరోసా, ఏకకాలంలో రైతు రుణమాఫీ, రైతు బీమా, ఆరోగ్యశ్రీ 10 లక్షలు, ప్రతినియోగ వర్గంలో ఇంటిగ్రేడ్ హై స్కూల్, రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ముందు సంక్షేపతకలతో ముందుకు వెళుతుందని తెలియడం జరుగు తుంది. 11వ తేదీన జరిగే ఎన్నికల్లో చేతి గుర్తు పై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మాట్టేవాడ సురేష్, శనిగరపు తిరుపతి, మంతెన సాంబయ్య, నోముల నారాయణ, ఇస్తారి, యూత్ కాంగ్రెస్ నాయకులు అప్పాల శీను, రాజశేఖర్ జన్ను, కోయిల క్రాంతి, రాజు, పాల్గొనడం జరిగింది.

# మానవత్వం చాటుకున్న వెదిరె బ్రదర్స్

నల్గొండ, ఫిబ్రవరి 6: నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే వెదిరె పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘా రెడ్డి సహకారంతో ఫౌండేషన్ వైస్ చైర్మన్,ఉప సర్పంచ్ వెదిరె విజేందర్ రెడ్డి పార్వతమ్మ కుటుంబాన్ని పరామర్శించి, బాధిత కుటుంబానికి రూ.10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వెదిరె విజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆపద సమయంలో సహాయ హస్తం అందించడం ఫౌండేషన్ లక్ష్యమని భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్పంచ్ జీడిమడ్ల నిర్మల దశరథ, జీడిమడ్ల ఇందిరమ్మ, జీడిమడ్ల మౌనిక, బోయపర్తి ప్రసాద్, జాల నర్సింహ, యాదగిరి రెడ్డి, జీడిమడ్ల వెంకటయ్య, బోయపర్తి లింగయ్య, సంకు శంకర్, మొగుదాల శివ, బోయపర్తి గణేష్, మొగుదాల శంభు గౌడ్, జీడిమడ్ల శంకర్, వడ్డేపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నో అనేది నా డిక్షనరీలో లేదు.. మీరు కోరుకున్న పనులు పూర్తి చేస్తా

**-గొంది దివ్య,లాజిశెట్టి రమ్య ఇద్దరిని గెలిపించండి**

**-మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఈటల రాజేందర్**

హైదరాబాద్ (మేడ్చల్) ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నో అనేది నా డిక్షనరీ లో లేదు.. మీరు కోరుకున్న పనులు పూర్తి చేస్తానని, గొంది దివ్య,లాజిశెట్టి రమ్య ఇద్దరిని గెలిపించాలని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఈటల రాజేందర్ ముడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మాపూర్ లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఓట్లు వేస్తాం కానీ రెండు పనులు చేయాలంటున్నారు. ఒకటి బండలమీద కట్టుకున్న ఇళ్ళకు టయిటల్స్ కట్టిచమంటున్నారు. రెండు రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న మల్లన్న గుడికి పొయ్యే దారి ఇప్పించాలని అడుగుతున్నారు. ఖచ్చితంగా మల్లన్నను చెరనుండి విడిపిస్తా. పండుగ జరుపుకోవడానికి అనుమతి ఇప్పిస్తా. చట్టాలు చేసేది దేవుడు కాదు. చట్టాని మార్చే శక్తి మనకే ఉంటుంది. ఈ ఊరిని సీఎం దత్తత తీసుకున్నారు. మరి ఎందుకు ఇక్కడ భూములకు హక్కులు ఇప్పించలేక పోతున్నావు మిస్టర్ రేవంత్ రెడ్డి. ఈ ఊరికి సర్వే నంబర్స్ వచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇస్తున్నాం. నో అనేది నా డిక్షనరీ లో లేదు. నేను మొదటి సారి ఎమ్మెల్యే అయినప్పుడు నాలుగు వందల ఓట్లు ఉన్న ఊరికి రెండు కోట్లు పెట్టి బ్రిడ్జి వేయించిన. హుజురాబాద్ లో అలాంటివి 22 బ్రిడ్జులు కట్టించిన. పెన్షన్లు ఎవరి ఇంట్లోనుండి ఇవ్వడం లేదు. పెన్షన్ కు 12 వేల కోట్ల రూపాయలు అయితే..మనం తాగి మందుకు కట్టే పన్ను 50 వేల కోట్లు. పెన్షన్లు పెంచి, కొత్తవి ఇచ్చి ఓటు అడగాలని లక్ష్మాపూర్ నుండి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్నా. నేను సేవకుణ్ణి అంటారు నరేంద్ర మోడీ . ఇక్కడే వాక్సిన్ తయారు చేయించి దేశానికి అందించారు మన ప్రధాని నరేంద్ర మోదీ. మల్లారెడ్డి డబ్బును నమ్ముకున్నాడు నేను మిమ్మల్ని నమ్ముకున్నాను.

# అమృత భారత్ స్టేషన్ పథకం కింద 172 స్టేషన్ల పనులు పూర్తి: అశ్వనీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశంలోని రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి లక్ష్యంగా దీర్ఘకాలిక విధానంతో రైల్వే మంత్రిత్వశాఖ అమృత భారత్ స్టేషన్ పథకాన్ని ప్రారంభించింది. దీనికింద స్టేషన్ల మెరుగుకు బృహత్ ప్రణాళికల రూపకల్పన, దశలవారీగా అమలు చేపడతారు. కింది అంశాలు ఈ ప్రణాళికలలో భాగంగా ఉంటాయి:

సుస్థిర, పర్యావరణ హిత పరిష్కారాలతోపాటు అవసరానుగుణ కంకర రహిత రైలు మార్గాలు నిర్మాణం, దశలవారీగా, సాధ్యాసాధ్యాల మేరకు దీర్ఘకాలికంగా స్టేషన్‌లో నగర కేంద్ర పునఃసృష్టి వగైరాలు ఈ పథకంలో భాగంగా ఉంటాయి. దీనికింద పునరాభివృద్ధి కోసం ఇప్పటిదాకా 1337 స్టేషన్లను గుర్తించగా, ఇప్పటిదాకా 172 స్టేషన్ల పనులు పూర్తయ్యాయి.

వంతెనల భద్రత

దేశవ్యాప్తంగా వంతెనల భద్రతకు రైల్వేలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. వంతెనలకు పటిష్ఠ భద్రత, జాగ్రత్త చర్యల దిశగా సుస్థిర వంతెనల తనిఖీ వ్యవస్థ ఉంది. సంబంధిత అధికారులు అన్ని వంతెనలనూ ఏటా రెండు సార్లు తనిఖీ చేస్తారు. ఈ మేరకు వర్షాకాలం ప్రారంభానికి ముందు, ఆ తర్వాత సమగ్ర తనిఖీ నిర్వహిస్తారు. దీనికితోడు చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ నిర్దేశించిన విధంగా కొన్ని వంతెనలను మాత్రం వాటి స్థితిగతులను బట్టి తరచూ పరిశీలన చేపడతుం టారు. కీలక, భారీ ఏటా 20 శాతం వంతెనల వంతున సమగ్ర సాంకేతిక తనిఖీ ప్రక్రియ నిర్వహిస్తారు.

వంతెనల మరమ్మత్తు/బలోపేతం/పునరుద్ధరణ/పునర్నిర్మాణం ఒక నిరంతర ప్రక్రియ. వంతెనల తనిఖీ ప్రాతిపదికన ఇది కొనసాగుతుంది. భారతీయ రైల్వేలలో 2022-2025 మధ్య (డిసెంబరు 2025 వరకు) 8,626 రైల్వే వంతెనల మరమ్మత్తు/పునరుద్ధరణ/బలోపేతం/పునర్నిర్మాణం చేపట్టారు.

అంతేకాకుండా కొన్ని వంతెనలను వాటి పరిస్థితిని బట్టి తరచూ తనిఖీ చేస్తారు. వంతెనల మరమ్మతు/బలోపేతం/పునరుజ్జీవనం/పునర్నిర్మాణం నిరంతర ప్రక్రియ. ఈ తనిఖీల సందర్భంగా వాటి భౌతిక స్థితిగతులను బట్టి అవసరమైనప్పుడల్లా తగిన చర్యలు చేపడతారు. దీంతోపాటు ప్రత్యేక సాంకేతిక తనిఖీ కూడా నిర్వహించి, ఆ మార్గంలోనూ తదుపరి చర్యలు తీసుకుంటారు. రుతుపవనాల ప్రారంభానికి ముందు, తర్వాత 'సబ్‌వేలు/ఆర్‌యూబీ'లను తనిఖీ చేస్తారు. వాటిలో నీరు చేరికను తగ్గించే చర్యల్లో భాగంగా కొత్త డిజైన్లతో మెరుగైన డ్రైనేజీ, సహజ కాలువలకు నీటి మళ్లింపు, హంప్‌లు, క్రాస్-డ్రెయిన్ల ఏర్పాటు, జాయింట్ల మూసివేత, ముప్పున్న ప్రదేశాల్లో అధిక సామర్థ్యం గల పంపుల ఏర్పాటు వంటివి కూడా చేపడతారు.

వంతెన పునరుద్ధరణ పనుల విధానాలను ఇండియన్ రైల్వే బ్రిడ్జ్ మాన్యువల్‌లో పొందుపరిచారు. కాంట్రాక్ట్ నిర్వహణ, సాధారణ-ప్రత్యేక కాంట్రాక్ట్ నిబంధనలతో నాణ్యత హామీ ప్రణాళిక, తనిఖీ-పరీక్ష ప్రణాళికల అనుసరణకు చర్యలు చేపడతారు.

భద్రతపై జవాబుదారీతనం దిశగా లోపాలు సరిదిద్దే బాధ్యత వ్యవధి తీరేదాకా భద్రత డిపాజిట్ నిలుపుదల, కాంట్రాక్ట్ రద్దు వంటి శిక్షార్హ నిబంధనలను అమలు చేస్తారు. వంతెన పనులను పూర్తి చేయడమన్నది ప్రదేశం, రకం, పథకాల ఆమోదం, అప్రోచ్ రోడ్ లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి ఏడాదిలో పని సీజన్ వ్యవధి, బ్లాక్‌ల లభ్యత, వేగ పరిమితుల విధింపు వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది.

రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలో ప్రస్తుతం 3 కోచ్ తయారీ యూనిట్లున్నాయి. ఈ యూనిట్ల నిర్మాణ వ్యయం, వాటి ప్రదేశం, తయారీ కోచ్‌ల రకం, ప్రణాళికబద్ధ ఉత్పత్తి సామర్థ్యం, తదనుగుణ యంత్ర సామగ్రి ఏర్పాటు తదితరాలపై ఆధారపడి మారుతుంది. కోచ్‌ల తయారీ యూనిట్ల నిర్మాణం వాటిపై దీర్ఘ కాలంలో వెచ్చించాల్సిన వ్యయంతోపాటు అనేక దశలలో సాగుతుంది. ఇందులో యూనిట్ల ప్రారంభ ఏర్పాటుతో పాటు ఎప్పటికప్పుడు సౌకర్యాల తదుపరి ఉన్నతీకరణ-విస్తరణ కూడా అంతర్భాగంగా ఉంటాయి. ఉదాహరణకు ఇటీవల పని ప్రారంభించిన రాయ్‌బరేలిలోని మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.3,042.83 కోట్లు వెచ్చించారు.

ఇక ప్రస్తుతం పనిచేస్తున్న 3 కోచ్‌ల తయారీ యూనిట్లలో- ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, చెన్నై; రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తల; మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ, రాయ్‌బరేలిలీ ఉన్నతీకరణ/విస్తరణ సంబంధిత వివిధ ప్రాజెక్టుల కోసం రూ.2443 కోట్లు మంజూరయ్యాయి.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల తయారీ విస్తరణకు సంబంధించి-ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో సురక్షిత, మరింత ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను దశలవారీగా ప్రవేశ పెట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. సాంకేతికంగా ఉన్నతమైన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ప్రయాణం మెరుగ్గా, సుందరంగా, తేలికైన డిజైన్, యాంటీ క్లైంబింగ్ ఫీచర్లు, వైఫల్య సూచన వ్యవస్థసహా ఎయిర్ సస్పెన్షన్ (సెకండరీ), స్టెయిన్‌లెస్ స్టీల్ షెల్, డిస్క్ బ్రేక్ సిస్టమ్ వంటి విశిష్టతలుంటాయి.

ప్రయాణికులకు తగిన సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా రైల్వే స్టేషన్లలోని స్టాళ్ల కేటాయింపులో ఎప్పటికప్పుడు అమలులోగల పద్ధతులకు అనుగుణంగా ఈ-వేలం/ఈ-టెండర్ ప్రక్రియలు నిర్వహిస్తారు.

దేశంలోని రైల్వే స్టేషన్లలో ప్రస్తుతం 11,650 స్టాళ్లు/యూనిట్లు ఉన్నాయి. వీటిని ఎస్సీ/ఎస్టీ వర్గాలు సహా అర్హులైన దరఖాన్తుదారులకు కేటాయించారు. రైల్వే స్టేషన్లలో ఉచిత స్టాళ్ల కేటాయింపు సంబంధిత విధానంలో ఎలాంటి నిబంధన లేదు.

పరిశుభ్రత నిరంతర ప్రక్రియ కాబట్టి, రైల్వేల్లో కోచ్‌ల సముచిత నిర్వహణ, పరిశుభ్ర స్థితిలో ఉంచడానికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటుంది. వాష్‌రూమ్‌లు సహా కోచ్‌లలో శుభ్రత, పారిశుధ్యం పర్యవేక్షణకు, భరోసా ఇవ్వడానికి రైల్వేలు కింది చర్యలు తీసుకుంటున్నాయి

రైల్వేలు ఏటా సగటున 58 కోట్ల భోజనాలను అందిస్తాయి. వీటిపై ఫిర్యాదులు సగటున 0.0008 శాతం మాత్రమే. ఇటువంటి ఫిర్యాదులపై గడచిన మూడేళ్లలో విచారణ ఆధారంగా, రూ.2.6 కోట్ల జరిమానా విధించారు.

ప్రయాణికుల అభిప్రాయ స్వీకరణ కోసం రైల్ మదద్ పోర్టల్ ద్వారా కొన్నేళ్లుగా భారతీయ రైల్వేల ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థను బలోపేతం, సరళీకృతం చేసి మరింత అందుబాటులోకి తెచ్చారు. రైల్ మదద్ పోర్టల్ ప్రారంభంతో ఫిర్యాదులు, సూచనలను నమోదుకు దశగా ప్రయాణికులకు రైల్వేలు సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాయి.

కేటరింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఐఆర్‌సీటీసీ, రైల్వే అధికారులు రైళ్లలో ఆకస్మిక, పునరావృత తనిఖీ చేస్తారు. ఆన్‌బోర్డ్ సేవల నిరంతర పర్యవేక్షణ, ప్రయాణిక ఫిర్యాదుల ప్రత్యక్ష పరిష్కారం కోసం సూపర్‌వైజర్లు, కేటరింగ్ అసిస్టెంట్లను ఐఆర్‌సీటీసీ నియమించింది. తనిఖీ విస్తృతం చేయడం కోసం మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కేటరింగ్ సేవల విభాగంపై పర్యవేక్షణకు అదనంగా ఆతిథ్య పర్యవేక్షకులను నియమించింది.

నిర్ణీత ధరల ప్రకారం ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచేందుకు రైల్వేలు నిరంతరం కృషి చేస్తున్నాయి. తదనుగుణంగా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటాయి. ఇందు లో భాగంగా రైళ్లలో అధిక ఛార్జీల వసూలు అరికట్టడానికి క్రింది చర్యలు చేపట్టాయి. కేంద్ర రైల్వే, సమాచార- ప్రసార, ఎలక్ట్రానిక్స్ మాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు లోక్‌సభ లో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారం వెల్లడించారు.

# అడ్డగోలుగా మాట్లాడితే సరిపోతుందా.. వాస్తవాలు చూసుకోరా..

**- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్**

అమరావతి ఫిబ్రవరి 6 (ఎక్సం ప్రెస్ న్యూస్);: వైసిపి పాలనలో చాలా సంఘటనలు జరిగాయని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సున్నిత అంశంపై చాలా ఆలోచించి మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై పవన్ మీడియాతో మాట్లాడుతూ.. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని, రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని విమర్శించారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకోటి కొందామని మాట్లాడారని, అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివాడు చేశారని చెప్పారని అన్నారు. తాను, సిఎం చంద్రబాబు నాయుడు చాలా అప్రమత్తంగా మాట్లాడతామని, ఎన్ డిడిబి నివేదికను సిఎం వినిపించారని తెలియజేశారు. జంతు కొవ్వు కలిసిందని చెప్ప డం చాలా సున్నిత అంశం అని..ఐదేళ్లు తమకు అవకాశం ఉన్నప్పుడు.. వచ్చిన 2 నెలల్లోనే అసత్యాలు చెబుతామా అని పవన్ ప్రశ్నించారు కళ్ల ముందు ఆధారాలు ఉన్నప్పుడు మాట్లా డకపోతే ఎలా అని చెప్పాల్సి వచ్చిందని మండిపడ్డారు. సాధారణంగా వ్యక్తిగతంగా వర్గాలపై కక్షలుంటాయి.. వీళ్లేమో భగవంతుడిపైనా పగ పెట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. నెయ్యిలో కల్తీ లేదని అన్ని నివేదికల్లో తేటతెల్లమైందని, ఏ నివేదికలోనూ క్లీన్ చిట్ ఇవ్వలేదనేది వాస్తవం అని పేర్కొన్నారు. ఫిష్ ఆయిల్, పందికొవ్వు ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్పాంని, అడ్డగోలుగా మాట్లాడితే సరిపోతుందా.. వాస్తవాలు చూసుకోరా.. అని ప్రశ్నించారు. ఈ అంశం ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదు..కేవలం హిందువులదేనని చెప్పారు. తప్పు జరిగినప్పుడు క్షమాపణ అడగకుండా తిరిగి తమపైనే దాడి చేస్తున్నారని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ, బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదు: కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 6: నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ, బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో వేములవాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించుకుని మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలపైన విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ పార్టీ దొంగ మాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలు చెప్పి పదవి ఎక్కిన తర్వాత ప్రజల్ని మోసంచేస్తున్నదన్నారు.వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సందర్భంగా బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చి ఆరు గ్యారెంటీలు అన్నింటిని వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన విషయాన్ని ఆ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఇచ్చిన బాండ్ పేపర్ ని ప్రజల ముందు చూపిస్తూ కేటీఆర్ మాట్లాడారు. ఈసారి తనకు ఓటు వేయకుంటే చనిపోతానని నాలుగు సార్లు ఓడిపోయినా అని చెప్పి సానుభూతి డైలాగులతో ఆరోజు ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ ఆ తర్వాత హామీల అమలు నుంచి మొదలుకొని అభివృద్ధి వరకు అడ్రస్ లేకుండా పారిపోయాడన్నారు. మరోవైపు కేవలం మంత్రి పదవి కావాలన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుంటున్న ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలన్నారు.ఇస్తామన్న ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్కదాన్నైనా అమలు చేశారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇన్ని రకాల మోసాల తర్వాత, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మేము చేస్తున్నదే సరైంది అని, ప్రజలు కాంగ్రెస్ కి అనుకూలంగా తీర్పు ఇస్తున్నారని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నదని, హామీల అమలు పైన భవిష్యత్‌లోనూ దృష్టి పెట్టే అవకాశమే ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు ముఖ్యంగా రూ.4వేల పింఛన్, ఆసరా పింఛన్ నుంచి మొదలుకొని రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం రావాలన్నా ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని, అప్పుడే తాము చేస్తున్న మోసాల పైన ప్రజలు కోపంగా ఆగ్రహంగా ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుంటుందన్నారు. మరోవైపు ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసింది ఏమీ లేదని, తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ఎలాంటి లబ్ధి చేయలేదన్నారు. ప్రతీ ఇంటికి రూ.15 లక్షలు ఇస్తానని చెప్పిన మోదీ ఆ తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతీసారి ఎన్నికలు రాగానే దేవుడి పేరు చెప్పి కులం, మతం పేరు చెప్పి బీజేపీ ఓట్లు ప్రజలతో వేయించుకుంటుందని కేటీఆర్ విమర్శించారు. ఈసారి కూడా బీజేపీ దొంగ మాటలకు మోసపోవద్దని, కేవలం పేదోళ్ల కడుపులు నింపి తండ్రి లెక్క చూసుకొని తెలంగాణ తెచ్చిన వారెవరో గుర్తుంచుకొని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.ఈ ఎన్నికల్లో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడితేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో అర ఆరు గ్యారెంటీలు అమలు పైన దృష్టి సారిస్తుందన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో వేసే ఓటుతో మరోసారి కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే ప్రస్థానం ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. వేములవాడలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు స్థానికంగా మున్సిపాలిటీకి పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఉన్నారు.

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వద్దు.. కేంద్రానికి సోనూ సూద్ విజ్ఞప్తి

న్యూ డిల్లీ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతను, చిన్నారులను పెను ప్రమాదంలోకి నెడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించాలని గతంలోనే కోరిన ఆయన.. ఈ తాజా ఘటన నేపథ్యంలో మరోసారి కేంద్ర ప్రభుత్వానికి తన విజ్ఞప్తిని బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఘజియాబాద్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వారు హింసకో, పేదరికానికో బలవ్వలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలైపోయారు. నేను మళ్ళీ చెబుతున్నాను.. చదువు కోసం తప్ప, మిగతా అన్ని విషయాల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. బాల్యానికి కావాల్సింది సరైన మార్గదర్శకత్వం, ప్రేమ.. అంతే కానీ అల్గారిథమ్స్, స్క్రీన్లు కాదు. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు, మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు.. ఇప్పుడైనా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది'. అంటూ సోనుసూద్ రాసుకొచ్చాడు.

# దాసారం బస్తీ వాసులకు అండగా ఉంటా : మాజీ మంత్రి తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 6: మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, మీరు మనోధైర్యం కోల్పోవద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్ నగర్‌లోని దాసారం బస్తీలోని గుడిసె వాసులు వెస్ట్ మారేడ్ పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఇంటూరి రమేష్, మరికొందరు వ్యక్తులు తమ బస్తీలో దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాలను చేపట్టారని, అడ్డుకునేందుకు వెళ్లిన తమ బస్తీ వాసులపై కిరాయి రౌడీలను తీసుకొచ్చి దాడి చేయించి గాయపర్చారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మీకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అంతేకాకుండా దాసారం బస్తీలో ఆక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లకు లేఖలు రాశారు. 30 సంవతారాల నుండి ఇక్కడే గుడిసెలు వేసుకొని 300 నిరుపేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని ఎమ్మెల్యే తలసాని లేఖలో వివరించారు. కొందరు వ్యక్తులు దౌర్జన్యం, దాడులకు పాల్పడి స్థానిక పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

దాసారం బస్తీలో దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని పేద ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన లేఖలలో కోరారు. కార్యక్రమంలో సనత్ నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, తిమ్మన్న, సూరి, రవి, తిరుమలయ్య, ఆదినారాయణ, దేవేందర్, రంగప్ప, స్వామి తదితరులు ఉన్నారు.

# ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి భావోద్వేగం

జగిత్యాల ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు.పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్స హిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరపున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఎ. రాంంం వులను ప్రోత్సవిాన్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరపున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలో నే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

# దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6: చరపల్లి డివిజన్ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఈసీనగర్, డీసీ కాలనీ, శ్రీసాయి గణేశ్ నగర్ కాలనీవాసులకు సీసీ రోడ్లు మంజూరు చేయడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చర్లపల్లి డివిజన్‌లో ఈసీనగర్ కాలనీకి 58లక్షలు, డీసీ కాలనీకి 44లక్షలు, శ్రీసాయిగణేశ్ కాలనీకి 24లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేశామని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

అదేవిధంగా కాలనీలలో పూర్తి స్థాయిలో డ్రైయినేజీ పనులు చేపట్టనున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేశ్‌గౌడ్, నాయకులు శ్రావణ్‌కుమార్‌గౌడ్, ఒడయ్య, రవి, దప్పు గిరిబాబు, అనంత్ రాజ్, సత్తిరెడ్డి,కడియాల బాబు, కొల నరేశ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, బిక్షపతి, పద్మిని, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్, మూర్తి, రమణ్‌కుమార్, బాల్‌రాజ్, మల్లేశ్, శేఖర్ ప్రసాద్, రామకృష్ణారెడ్డి, నర్సింహ్మారెడ్డి, నరేశ్, విషయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్: హరీష్‌రావు

హైదరాబాద్(జిన్నారం)ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు.మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరకక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు.

# సమాజంలోని అసమానతలు... డికెన్స్ రచనల ప్రధాన అంశాలు

**ఫిబ్రవరి 7...చార్లెస్ డికెన్స్ జయంతి**



చార్లెస్ డికెన్స్ (1812–1870) ఒక ప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత, సామాజిక విమర్శకుడు. విక్టోరియా కాలం నాటి బ్రిటిష్ సమాజంలోని పేదరికం, అన్యాయం, దుర్నీతి, సామాజిక అసమానతలను తన రచనల ద్వారా ప్రస్ఫుటంగా వివరించిన మహానుభావుడు. డికెన్స్ రచనలు పాఠకులను ఆలోచింపజేసి, సమాజంలో మార్పు తీసుకురావాలని ఆకాంక్షించేవి.

చార్లెస్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న ఇంగ్లాండ్‌లోని పోర్ట్స్‌మౌత్‌లో జన్మించారు. ఆయన తండ్రి జాన్ డికెన్స్ నేవీ క్లర్క్‌గా పనిచేశారు. కుటుంబం మధ్యతరగతి అయినప్పటికీ, ఆర్థిక సమస్యలు ఎప్పటికప్పుడు వెంటాడాయి. అప్పుల బారి వల్ల డికెన్స్ తండ్రి జైలుకు వెళ్లగా, చిన్నతనంలోనే డికెన్స్ కఠిన జీవితం గడపాల్సి వచ్చింది.

12 ఏళ్ల వయస్సులో డికెన్స్ లండన్‌లోని ఒక బూట్ల ఫ్యాక్టరీలో పనిచేయాల్సి వచ్చింది. చిన్న వయసులోనే వీక్షించిన దుర్భర జీవన పరిస్థితులు, సమాజంలోని అసమానతలు అతని రచనల ప్రధాన అంశాలుగా మారాయి.

డికెన్స్ తన రచనా ప్రస్థానాన్ని పాత్రికేయుడిగా ప్రారంభించాడు. అతి త్వరలోనే అతని ప్రతిభ ప్రజల మనసులను గెలుచుకుంది. 1836లో వచ్చిన "ది పిక్విక్ పేపర్స్" అతనికి మొదటి పెద్ద విజయాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత, డికెన్స్ అనేక ప్రసిద్ధ నవలలు రాశాడు, అవి సాహిత్య ప్రపంచాన్ని అలరించాయి.

## ముఖ్య రచనలు...

"ఒలివర్ ట్విస్ట్" (1838) అనాథల దుర్భర జీవనాన్ని సున్నితంగా ప్రతిబింబించిన ఈ నవల పేదరికం మరియు సమాజంలోని దుర్నీతి గురించి ఓ స్పష్టమైన చిత్రాన్ని అందించింది.

"ఎ క్రిస్మస్ క్యారోల్" (1843) సంస్కార మార్పును గురించి రాసిన కథ. స్క్రూజ్ అనే కఠిన హృదయుడి మార్పు ద్వారా డికెన్స్ నమ్మకం, కరుణ, మానవతా విలువలను చాటి చెప్పాడు.

"డేవిడ్ కాపర్ఫీల్డ్" (1850) డికెన్స్ స్వీయ జీవితానుభవాలకు అద్దం పట్టిన నవల. ఇది చదువరుల హృదయాలను గెలుచుకుంది.

"ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్" (1859) ఫ్రెంచ్ విప్లవం నేపథ్యంగా రాసిన ఈ నవల ప్రేమ, త్యాగం, మరియు విముక్తి గురించి ఆవిష్కరించింది.

"బ్లీక్ హౌస్" (1853) ఇంగ్లాండ్ చట్టవ్యవస్థలోని లోపాలను వ్యంగ్యంగా, తీవ్రంగా ఎత్తి చూపింది.

డికెన్స్ రచనలు హాస్యం, వ్యంగ్యం, కరుణ, సామాజిక స్పృహలను కలగలిపి ఉంటాయి. అతని పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ప్రతీ పాత్రకు ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుంది. ఆయన భాష సులభంగా అర్థమయ్యేలా, కానీ భావగంభీరంగా ఉంటుంది. డికెన్స్ తన రచనల ద్వారా పేదల సమస్యలను, అధికారుల అన్యాయాలను చర్చించాడు.


రచయితగా మాత్రమే కాకుండా, డికెన్స్ సామాజిక ఉద్యమాలలో కూడా చురుకుగా పాల్గొన్నారు. అనాథ పిల్లల హక్కుల కోసం కృషి చేశారు. పేదల కోసం సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠకులలో మానవతా భావాలను పెంచే ప్రయత్నం చేశారు.

డికెన్స్ రచనలు విభిన్న సామాజిక సమస్యలను ప్రస్తావించాయి: పేదలపై పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోగిస్తున్న ఒత్తిడిని అతని రచనలు ప్రతిబింబించాయి. చట్టాలు పేదల కోసం ఉండవన్న స్పష్టమైన సందేశాన్ని ఆయన రచనల ద్వారా చాటి చెప్పాడు. ప్రేమ, కరుణ, న్యాయం, సత్యం వంటి విలువలపై ఆయన గాఢమైన నమ్మకం చూపించారు.

డికెన్స్ 1870 జూన్ 9న గడ్‌హిల్ ప్లేస్‌లో మరణించారు. ఆయన మరణం తో ప్రపంచ సాహిత్యం ఓ మహా రచయితను కోల్పోయింది.

డికెన్స్ రచనలు కాలాతీతం. ఇవి అనేక భాషల్లో అనువాదమయ్యి, ప్రపంచ వ్యాప్తంగా చదవబడుతున్నాయి. నాటకాలుగా, సినిమాలుగా రూపాంతరం పొందాయి. సమాజంలో మార్పు తేవడానికి ఆయన రచనలు నేటికీ స్ఫూర్తినిచ్చే సాధనంగా ఉన్నాయి.

చార్లెస్ డికెన్స్ ఒక రచయితగా మాత్రమే కాకుండా, ఓ మానవతావాది, సామాజిక కార్యకర్తగానూ చరిత్రలో నిలిచిపోయారు. ఆయన రచనలు పాఠకుల హృదయాలను నానాటికి అలరిస్తూనే ఉంటాయి. "డికెన్స్" అనే పేరు, ఆంగ్ల సాహిత్యంలో ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటుంది.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# కానిస్టేబుల్‌ను చంపి తినేసిన పులి.. గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో పులి మృతి

అరుణాచల్ ప్రదేశ్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అరుణాచల్ ప్రదేశ్‌లో బుల్లెట్ గాయాలతో ఒక పులి మరణించింది. అంతకంటే రెండు రోజులముందు ఒక కానిస్టేబుల్‌ను పులి చంపి తినేసింది. దీంతో ఆ పులిని ఎవరైనా ప్రతీకారంతో కాల్చి చంపారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన అరుణాచల్ ప్రదేశ్, దిగువ దిబాంగ్ వ్యాలీ జిల్లా, మయోడియా ప్రాంతంలో జరిగింది.సోమవారం సాయంత్రం చిక్సెంగ్ మన్వాంగ్ అనే హెడ్ కానిస్టేబుల్ బైకుపై వెళ్తుండగా అతడిపై పులి దాడి చేసి చంపినట్లు తెలుస్తోంది. అతడు కనిపించకపోవడంతో పోలీసులు, ఫారెస్టు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అతడి మృతదేహం లభ్యమైంది. సగం వరకు మృతదేహాన్ని పులి తిన్నట్లు గుర్తించారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. పులిని బంధించాలని, అంతం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని, పులి సంచారం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ఇదే సమయంలో కానిస్టేబుల్‌పై పులి దాడి చేయడాన్ని ఎవరూ చూడలేదు. కానీ, ఆ ప్రాంతంలో పులి సంచరించడాన్ని కొందరు చూశారు. దీంతో అతడిని పులి చంపి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత గురువారం అటవీ ప్రాంతంలో ఒక పులి చనిపోయి కనిపించింది. బుల్లెట్ గాయాలతోనే ఆ పులి మరణించినట్లు గుర్తించారు.అయితే, ఆ పులిని ఎవరు కాల్చి చంపారు అనే విషయంలో స్పష్టత లేదు. కానిస్టేబుల్ మృతికి ప్రతీకారంగా ఎవరైనా కాల్చి చంపారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. మరణించింది ఆడపులి. అయితే, కానిస్టేబుల్‌పై దాడి చేసింది ఇదే పులా.. లేక మరోటా అనే విషయంలో కూడా స్పష్టత లేదు. ఏదేమైనా అటు అటవీ అధికారుల నిర్లక్ష్యం.. ఇటు మనుషుల చర్యలు వల్ల అటవీ జంతువులకు నివాసం కరువవడం వంటి అంశాలే కానిస్టేబుల్ మరణానికి, పులి ప్రాణం పోవడానికి కారణమైందని జంతు ప్రేమికులు అంటున్నారు. ఘటనలపై విచారణ కొనసాగుతోంది.

# బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ చెన్నమనేని దీప



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 6: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 19వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి రేగుల రాధిక -సంతోష్ బాబు దంపతులకు మద్దతుగా పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు సతీమణి డాక్టర్ దీప ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డు బీజేపీ అభ్యర్థి రేగుల రాధిక సంతోష్ బాబు తరఫున ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలను కలుసుకుని బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో భాగంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన పలు పథకాలు సామాన్య ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను తెలియజేశారు. గతంలో సంతోష్ బాబు 20వ వార్డులో కౌన్సిలర్ గా చేసిన పలు అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.ప్రజలు ఆశీర్వదించి ఈ ఎన్నికల్లో 19వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేగుల రాధిక-సంతోష్ బాబు లను కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.వార్డు సమగ్ర అభివృద్ధికి రేగుల రాధిక సంతోష్ బాబు ఎల్లవేళలా కృషి చేస్తారని, వారికి తమ ఆశీర్వాదాలు పుష్కలంగా ఉంటాయని తెలియజేశారు.వార్డు ప్రజలందరూ ఆలోచించి రాధిక సంతోష్ బాబు లను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు,పార్టీ కార్యకర్తలు,స్థానిక వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# కౌన్సిలర్‌గా రాపల్లి శ్రీధర్‌ను గెలిపించాలి

**-24వ వార్డులో రాపెల్లి లావణ్య విస్తృత ప్రచారం**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 6: నేటినిజం ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. శుక్రవారం బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి రాపల్లి శ్రీధర్



గెలుపును కాంక్షిస్తూ ఆయన భార్య, మాజీ కౌన్సిలర్ రాపల్లి లావణ్య వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మహిళా ఓటర్లను కలిసి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా లావణ్య ప్రతి ఇంటి గడపను తడుతూ మహిళలకు ఆత్మీయంగా తిలకం దిద్దారు. వార్డు అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశా రు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, స్థానికంగా అందుబాటులో ఉండి సేవ చేసే గుణం ఉన్న రాపల్లి శ్రీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో కౌన్సిలర్‌గా తాము చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూనే, రాబోయే రోజుల్లో వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు, మహిళా కార్యకర్తలు బీజేపీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రచారానికి వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

# కేటీఆర్ మాటలు అహంకారానికి నిదర్శనం

**– వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 6: నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 09,10,15 వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించలని ఓటర్లను కోరుతున్నానని తెలిపారు.గత పది సంవత్సరాలలో ఒకసారి బీజేపీ బిఆర్ఎస్ కు అవకాశం ఇచ్చారని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేటీఆర్ వేములవాడలో మాట్లాడిన మాటలు అతని అహంకారనికి నిదర్శనమని తెలిపారు. వాడు వీడు అంటూ కేటీఆర్ మాట్లాడిన తీరు చూస్తుంటే అతని బుర్జ మనస్తత్వానికి నిదర్శనమని తెలిపారు.మొదట కేటీఆర్ వేములవాడ వచ్చినపుడు వేములవాడ అభివృద్ధి చేయలేదు ప్రజలను క్షమాపణలు కోరుతారు అనుకున్నామని, కానీ మా హయాంలో వేములవాడ అభివృద్ధి చేయలేము ప్రజలారా మన్నించండి అంటాడు అనుకున్నామని తెలిపారు.కేటీఆర్ నువ్వు మొదటి సమావేశంలో మాట్లాడుతున్నప్పుడు ని కుడివైపు మూడో బ్రిడ్జి కనిపించలేదా అని ప్రశ్నించారు. మీ హయాంలో అర్ధాంతరంగా ఆగిపోతే మేము వచ్చాక పనుంది ప్రారంభించామని, మీరు బ్రిడ్జి నిర్మాణ భూసేకరణకు నిధులు ఇవ్వకుంటే 12 కోట్ల నిధులు ఇచ్చి మేము బ్రిడ్జి పనులు చేస్తున్నామని తెలిపారు. కేటీఆర్ రెండో మీటింగ్ జరిగిన స్థలం వద్ద 80 ఫీట్ల రోడ్డు వెడల్పు నీ కంటికి కనిపించలేదా అని ప్రశ్నించారు. 80 ఫిట్ల రోడ్డు వెడల్పు లో నీ రెండవ మీటింగ్ జరిగిందని, అది నీ కళ్ళకు కనిపించిలేదా అని తెలిపారు. వేములవాడ అంటే కేటీఆర్ నీకెందుకు అంత చులకన అని ప్రశ్నించారు. నువ్వు వేములవాడలో మీటింగ్ పెట్టిన ప్రతి చోట అభివృద్ధి చేసిన పనులు ఉన్నాయని తెలిపారు. మేము వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నా మని తెలిపారు.మేము కూడా వాడు వీడు అనొచ్చు కానీ మాకు సంస్కారం అడ్డు వస్తుందని తెలిపారు. కళ్ళు మొక్కే సంస్కృతి మిది మాది కాదని తెలిపారు. సిరిసిల్ల ప్రజలకు నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తానని మోసం చేసింది నువ్వు కదా అని తెలిపారు. నేతన్నలకు బకాయిలు పెట్టింది నువ్వు కదా అని తెలిపారు. మేము వేములవాడకు 50 కోట్లతో యారన డిపో తీసుకురావడం జరిగిందని తెలిపారు. నీ మూడవ మీటింగ్ పెట్టిన కడ మీరు వదిలేసిన రోడ్డు మేము పూర్తి చేస్తున్నామని, మూడు కోట్లతో రోడ్డు పనులు చేస్తున్నామని తెలిపారు.కేటీఆర్ నీకు కళ్ళు కనిపించే కంటే కంటి ఆపరేషన్ చేసుకో చెవులు వినిపించకుంటే ఆపరేషన్ చేసుకో అని తెలిపారు. కేటీఆర్ వేములవా డ లో పచ్చి అబద్ధాలు ఆడారని తెలిపా రు.రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేశాం అన్నారని, మీ హయాంలో ఒక్క పాత ఇటుక తీసి కొత్త ఇటుక కూడా పేర్చలేదని తెలిపారు. ఆ మాటలు అన్నం దుకు సిగ్గుపడాలని తెలిపారు. కేటీఆర్ మేము పట్నం నుండి కాదు పల్లె నుంచి వచ్చిన వారం మాకు కూడా ప్రతిదీ మాట్లాడ వచ్చు అని తెలిపారు. వెయ్యి కోట్లతో వేములవాడ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు .నువ్వు పెట్టిన రెండవ మీటింగ్ నుండి సక్కగా చూస్తే రాజన్న ఆలయ అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. మీ చెల్లి అన్న మాటలకు మొదటగా సమాధా నం చెప్పు అని తెలిపారు.నేను చేయని అభివృద్ధి ఆది శ్రీనివాస్ చేస్తున్నారని కేటీఆర్ కుళ్ళిపోయిన మనస్తత్వంతో మాట్లాడుతున్నారని తెలిపారు.మీ హామీలు నీటి మూటలు అయినా వేళ నువ్వు సిరిసిల్లకి అమావాస్య కు పున్నం కు వచ్చే వాడివి ఏదో ఎన్నికలు ఉన్నాయని వేములవాడ వచ్చావు అని తెలిపారు.మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ను ఫెయిల్ అయ్యావు అని తెలిపారు. మేము ఇక్కడే ఉండే వాళ్ళం అని, మా ప్రజలకు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేవారం అని తెలిపారు.మీలాగా ఇచ్చిన మాట తప్పకుండా మేము రాసిచ్చిన బాండ్ పేపర్లో హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకసారి సోయి ఉంటే చూస్కో అని తెలిపారు.నీ పక్కన ఉన్నవారు నీ మెప్పు పొందడం కోసం నువ్వు మాట్లాడితే చప్పట్లు కొడుతున్నారు అని తెలిపారు. వారందరికీ తెలుసు వేములవాడ అభివృద్ధి ఎంత జరిగిందో అని తెలిపారు. నువ్వు మాట్లాడేటప్పుడు నీ పక్కన ఉన్న కౌన్సిలర్ అభ్యర్థులు కూడా నువ్వు అనవసరంగా వేములవాడకు వచ్చావు అనుకున్నారు అని తెలిపారు.నువ్వు వేములవాడకు రాకుంటే బాగుండని నీ పక్కన ఉన్నవారు అనుకుంటున్నారు అని తెలిపారు. మీ హయాంలో గాలికి వదిలేసిపనులన పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.

# ఈనెల 12న జరిగే కార్మికుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం : దాస్యం వినయ్‌భాస్కం



హన్మకొండ, ఫిబ్రవరి 6: ఈనెల 12న జరిగే కార్మిక దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాన్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఉమ్మడి సన్నాహక సమావేశాన్ని శుక్రవారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్?ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వం రైతు, కార్మిక, ఉద్యోగుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులకు, ఉద్యోగులకు పనిభారం పెంచి, వేతనాలు తగ్గించి శ్రమ దోపిడీ చేసేందుకు పెట్టుబడిదారుల కుట్రలకు కేంద్రం వత్తాసు పలుకుతూ నాలుగు లేబర్ కోడ్స్?ను తీసుకొచ్చిందని వివరించారు. రైతుల స్ఫూర్తితో కార్మికులు హక్కుల సాధన కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అసంఘటిత, సంఘటిత కార్మిక సంఘాలన్ని కలిసి ఈనెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, బీఆర్టీయూ, టీఎన్టీయూసీ, ఐఎఫ్ టీయూ, ఏఐసీటీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కీలక వడ్డీరేట్లు యథాతథం.. రిజర్వ్ బ్యాంక్

ముంబయి ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తామని తెలిపింది. ఆర్‌బిఐ ద్రవ్యపరపతి విధానాన్ని సమీక్షించింది. కీలక వడ్డీ రేట్లలో మార్పులేదని ఆర్‌బిఐ వెల్లడించింది. రేపోరేటు యథాతథం 5.25 శాతంగా ఉంచామని పేర్కొంది. దేశ జిడిపి వృద్ధి రేటు 7.2 శాతంగా ఉందని తెలిపింది. డిసెంబర్ లో జరిగిన సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 5.50% నుండి 5.25% కు 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణం చాలావరకు నియంత్రణలో ఉందని, అయితే వృద్ధి సూచికలు మిశ్రమ సంకేతాలను చూపిస్తున్నాయి. ఆర్‌బిఐ మానిటరీ పాలసీ నిర్ణయం మధ్యతరగతి ప్రజలను నిరాశకు గురి చేసింది. వడ్డీ రేట్లు తగ్గడంతో పాటు హోమ్ లోన్లు, కారు లోన్లు నుంచి ఇఎంఐల భారం తగ్గుతుందని ఆశించిన జనాలకు ఆర్‌బిఐ నిర్ణయం షాక్‌కు గురి చేసింది. ప్రస్తుతం ఉన్న వడ్డీ రేటు 5.25 శాతం కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం నుంచి ఆర్‌బిఐ 125 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటును తగ్గించింది, కానీ ఈ సారి యథాతథం అని చెప్పడంతో సామాన్య ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ 7.3 శాతంతో పటిష్టంగా ఉన్నప్పటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ఆర్థిక స్థిరత్వానికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఆహారేతర వస్తువుల ధరలు పెరుగుదలపై నిఘా ఉంచడంతో రూపాయి విలువలో హెచ్చుతగ్గులతో ఆరబిఐ అప్రమత్తమైంది.

# అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా పెద్ద చెరువు పక్కన ప్రభుత్వ ఖాళీ స్థలం

**-ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లకుండా చూడాలి..**
**-యువత ప్రక్కదారి పడకుండా నిరోధించాలి**
**-సీనియర్ సిటిజన్లకు విశ్రాంతి, ప్రజలకు వినోదం, క్రీడల అభివృద్ధి కోసం ఈ స్థలాన్ని పార్క్ మరియు క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలి**
**-బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ డిమాండ్**



హైదరాబాద్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిధిలో లక్ష్మీ స్టార్చ్ కంపెనీ సమీపంలో ఉన్న పెద్ద చెరువు పక్కన సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈనేపథ్యంలో బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో ప్రతినిదుల బృందం ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిదిలో లక్ష్మీ స్టార్చ్ కంపెనీ సమీపంలో ఉన్న పెద్ద చెరువు పక్కన సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఈ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నదని స్తలాన్ని వారు పరిశీలించారు..ఈ సందర్భంగా దేవసాని బాలచందర్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కాలంలో గౌరవ మాజీ మంత్రివర్యులు టి. దేవేందర్ గౌడ్ ఈ చెరువును ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ చేశారు. అనంతరం మిగిలిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు అక్రమంగా గుడిసెలు నిర్మించేందుకు ప్రయత్నించిన సందర్భంలో మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఉద్యమం చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని రక్షించిన విషయం గుర్తుచేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లకుండా, యువత ప్రక్కదారి పడకుండా నిరోధించడానికి, అలాగే సీనియర్ సిటిజన్లకు విశ్రాంతి, ప్రజలకు వినోదం, క్రీడల అభివృద్ధి కోసం ఈ స్థలాన్ని పార్క్ మరియు క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలని గౌరవ పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మరియు స్థానిక ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు..ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా మరియు జీహెచ్ఎంసీ విభాగాల సమన్వయంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రజా వినియోగానికి మార్చి అధిక జనసాంద్రత కలిగిన చిల్కానగర్ ప్రాంతానికి ఉద్యానవనం మరియు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, గ్రామ పెద్దలతో పాటు ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్ , బీజేపీ సీనియర్ నాయకులు తిరుపతి సత్యనారాయణ, అడ్వకేట్ ఆలే నరేందర్, శామీర్పేట చంద్రయ్య , విద్యాసాగర్ , ఓర్సు శేఖర్, భవానంద్,, ముత్యాల కృష్ణారెడ్డి , సదాశివరెడ్డి, రమేష్ , కార్తీక్ , వివేక్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com